PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 17, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 08 - మార్చి - 2026, వెల రూ.5/-

## 50 యుద్ధ విమానాలతో ఖమేనీ బంకర్ ను ధ్వంసం చేశాం: ఐడీఎఫ్



ఇరాన్ పై తాజాగా జరిగిన దాడిలో పాల్గొన్న 50 యుద్ధ విమానాలు

టెహ్రాన్ లోని భూగర్భ బంకర్ పై ఇజ్రాయెల్ భీకర దాడి

ఆపరేషన్ రోర్ ఆఫ్ ది హారియర్ పేరుతో ఇజ్రాయెల్ సైనిక చర్య

## అమెరికా దాడిలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోవడంపై జైశంకర్ స్పందన



మిలన్-2026 విన్యాసాల్లో మూడు ఇరాన్ యుద్ధ నౌకలు పాల్గొన్నాయన్న జైశంకర్

మార్చి 1న ఇరాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు కొచ్చి పోర్టులో వాటికి డాకింగ్ అనుమతి ఇచ్చినట్టు వెల్లడి

## హోర్ముజ్ వద్ద అమెరికా దళాల కోసం వేచి చూస్తున్నాం: ఇరాన్ హెచ్చరిక



చమురు రవాణాకు అమెరికా కీలక నిర్ణయం

హోర్ముజ్ వద్ద నౌకలకు రక్షణగా తమ బలగాలు ఉంటాయన్న అమెరికా

అమెరికా బలగాలను ఎదుర్కొనేందుకు వేచి చూస్తున్నామన్న ఐఆర్జీసీ

## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్




- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు

# ప్రపంచంలో పేరున్న పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొస్తున్నాం

## 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

- పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతున్నారంటూ వైసీపీ దుష్ప్రచారం
- గత పాలకులు మెడికల్ కాలేజీలకు భూమిని చూపించలేదని ఆరోపణ
- పీపీపీ విధానంలో నిర్మిస్తే అది ప్రైవేట్ పరం కాదని స్పష్టీకరణ
- గత పాలనలో ఎక్సైజ్‌లో అతిపెద్ద కుంభకోణమన్న చంద్రబాబు



అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక 20 నెలల్లో 6.28 లక్షల మందికి ఉద్యోగాల కల్పించామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు ఎంఎస్ఎంఈలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 కల్పించామని తెలిపారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని..అంతకంటే ఎక్కువ ఉద్యోగాలే కల్పించి హామీని నిలబెట్టుకుంటామని ఉద్ఘాటించారు. ఇందుకోసం ఓ కమిటీని కూడా నియమించామని అన్నారు. పెట్టుబడులు, మిగతా..2లో

## ప్రాజెక్టుల నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం చంద్రబాబు



- పోలవరం, వెలిగొండ సహా పలు కీలక ప్రాజెక్టుల ప్రగతిపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- దెబ్బతిన్న పోలవరం డయాఫ్రం వాల్ స్థానంలో కొత్తది నిర్మించాలని నిర్ణయం
- నిపుణుల నివేదికలు ఉన్నప్పటికీ.. ప్రజా భద్రతకే ప్రాధాన్యత అని వెల్లడి

## చంద్రబాబు అసెంబ్లీలో తప్పుడు లెక్కలు చెప్పారు

పేర్ని నాని ధ్వజం

అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాలపై పేర్ని నాని విమర్శలు

కార్పొరేషన్ల ద్వారా పొందుతున్న రుణాలను దాచిపెట్టారని ఆరోపణ

గీతం యూనివర్సిటీ ఆక్రమించిన భూములను క్రమబద్ధీకరిస్తున్నారన్న నాని



అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గణాంకాలు, బడ్జెట్ వివరాలపై మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సభ సాక్షిగా అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు చెప్పారని ఆయన ఆరోపించారు. గతేడాది సుమారు రూ. 1.03 లక్షల కోట్ల అప్పు చేసిన ప్రభుత్వం, ఈ ఏడాది రూ. 97 వేల కోట్లు తీసుకుంటామని మిగతా..2లో

## గద్దర్ అవార్డుల ప్రకటన..

చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

జయసుధకు ఏఎన్నార్ అవార్డు

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి

ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)

ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)

ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)




అమరావతి: 2025లో విడుదలైన చిత్రాలకు సంబంధించి 'గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025' విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు ఈరోజు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న మిగతా..2లో

## రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

రేవంత్ రెడ్డిని కలిసిన డెలావర్ గవర్నర్ మాట్ మేయర్

ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలపై చర్చ

డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని రేవంత్ కు ఆహ్వానం



హైదరాబాద్: అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ముఖ్యంగా ఆరోగ్యం, విద్య మరియు సాంకేతిక రంగాలలో పరస్పర సహకారంపై కీలక చర్చలు జరిగాయి. వీరి భేటీలో ప్రజాక్షేమం, పాలనా సంస్కరణలే ప్రధాన ఎజెండాగా నిలిచాయి. డెలావర్ రాష్ట్రంలో తాము విజయవంతంగా అమలు చేసిన పేద, మధ్యతరగతి ప్రజల గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ కార్యక్రమాల గురించి మాట్ మేయర్ ఈ సందర్భంగా మిగతా..2లో

## అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదన్న ముఖ్యమంత్రి
- మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ
- మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్న ముఖ్యమంత్రి



రాజ్యసభకు తెలంగాణ కాంగ్రెస్

## అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం!

- పెద్దల సభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి
- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణతో సులువైన ఎన్నిక
- గడువు తర్వాత లాంఛనంగా ప్రకటించనున్న అధికారులు

# మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం

## మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది

వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం

మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది

వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం.



హైదరాబాద్: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొన్నారు. “మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొస్తున్నాం. వారు ఆర్థికంగా బలపడాలనే ఆలోచనతోనే మహిళాశక్తి పథకం తీసుకొచ్చాం. మహిళలపై ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉంది. వారి ప్రాధాన్యం గుర్తించి పార్టీలో పదవులు ఇస్తున్నాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలే యజమానులు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోంది. సోషల్ మీడియాలో మహిళలను వేధించే ఘటనలు తాజాగా పెరుగుతున్నాయి. వాటిని కట్టడి చేయాలి ” అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, సినీ నటుడు సాయి దుర్గతేజ్ తదితరులు పాల్గొన్నారు.

# 50 యుద్ధ విమానాలతో ఖమేనీ బంకర్ ను ధ్వంసం చేశాం: ఐడీఎఫ్

ఢిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఉపయోగించే భూగర్భ బంకర్ ను ఇజ్రాయెల్ దళాలు ధ్వంసం చేశాయి. తాజా దాడిలో దాదాపు 50 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) అధికారికంగా వెల్లడించింది. 'ఆపరేషన్ రోర్ ఆఫ్ ది హారియర్' పేరుతో ఈ దాడిని నిర్వహించినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ విభాగం అందించిన పక్కా సమాచారంతో, టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న లీడర్ షిప్ కాంప్లెక్స్ కింద నిర్మించిన భారీ భూగర్భ బంకర్ ను లక్ష్యంగా చేసుకుని ఈ వైమానిక దాడులు జరిగాయి. అత్యవసర సమయాల్లో యుద్ధ కార్యకలాపాలు నిర్వహించడానికి, తమ మిలిటరీ ప్లాన్స్ అమలు చేయడానికి ఇరాన్ పాలకులు ఈ బంకర్ ను ఎన్నో ఏళ్ల పాటు శ్రమించి నిర్మించుకున్నారని ఐడీఎఫ్ పేర్కొంది. అనేక వీధులకు విస్తరించి ఉన్న ఈ బంకర్ లో సీనియర్ అధికారుల కోసం మీటింగ్ రూమ్ లు, ఎంట్రీ పాయింట్లు ఉన్నాయని, దీనిని ఖమేనీ వినియోగించుకునేలోపే ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం వివరించింది. ఖమేనీ హతం తర్వాత కూడా ఇరాన్ సీనియర్ అధికారులు ఈ కాంప్లెక్స్ ను వినియోగిస్తున్నారని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడి ద్వారా ఇరాన్ అత్యంత కీలకమైన కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను దెబ్బతీశామని, ఇది ఆ దేశ మిలిటరీ సామర్థ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది. ఇరాన్ లోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన ఈ ప్రాంతాన్ని సుదీర్ఘ నిఘా అనంతరం ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ స్పష్టం చేసింది.

# అమెరికా దాడిలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోవడంపై జైశంకర్ స్పందన

ఢిల్లీ: ఢిల్లీలో జరుగుతున్న రైసినా డైలాగ్ 2026 వేదికగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్ హిందూ మహాసముద్రంలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇరాన్ నౌకలకు భారత్ ఇచ్చిన అనుమతులపై కీలక వివరణ ఇచ్చారు. శ్రీలంక తీరంలో అమెరికా సబ్‌మెరైన్ దాడిలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోయిన కొన్ని రోజులకే ఈ వ్యాఖ్యలు రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

జైశంకర్ వివరించిన ప్రధానాంశాలు ఇవే:

హిందూ మహాసముద్రంలో మూడు ఇరాన్ నౌకలు (ఐరిస్ దేనా, ఐరిస్ లావన్, ఐరిస్ బుషెహర్) ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జరిగిన మిలాన్-2026 (మిలన్ 2026) విన్యాసాల్లో పాల్గొన్నాయి. అయితే, మార్చి మొదటి వారంలో అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య యుద్ధం ముదరడంతో ఈ నౌకలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. మార్చి 1న ఇరాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు, మానవీయ కోణంలో ఆలోచించి వాటికి కొచ్చి పోర్టులో డాకింగ్ అనుమతి ఇచ్చినట్లు జైశంకర్ తెలిపారు. ఆ నౌకల్లో యువ క్యాడెట్లు ఉన్నారని, వారు అనుకోని పరిస్థితుల్లో ఈ పరిణామాల మధ్య చిక్కుకున్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీలంక తీరానికి సమీపంలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. మార్చి 4న అంతర్జాతీయ జలాల్లో ఉన్న ఇరాన్ ఫ్రిగేట్ 'ఐరిస్ దేనా'పై అమెరికా సబ్‌మెరైన్ టార్పెడోతో దాడి చేయడంతో అది మునిగిపోయిందని గుర్తుచేశారు. భారత్ చట్టపరమైన అంశాల కంటే మానవత్వానికే పెద్దపీట వేసిందని, తాము తీసుకున్నది సరైన నిర్ణయమని జైశంకర్ స్పష్టం చేశారు. హిందూ మహాసముద్రంలో విదేశీ సైనిక స్థావరాల ఉనికి అనేది వాస్తవమని, ఈ నేపథ్యంలో భారత్ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన చెప్పారు.

# హోర్ముజ్ వద్ద అమెరికా దళాల కోసం వేచి చూస్తున్నాం: ఇరాన్ హెచ్చరిక

ఢిల్లీ: అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసిన విషయం తెలిసిందే. దీనితో తమ భద్రతా బలగాలు హోర్ముజ్ నుంచి వెళ్లే నౌకలకు రక్షణగా ఉండేందుకు సిద్ధమయ్యాయని అమెరికా ప్రకటించింది. ఈ ప్రకటనపై ఇరాన్ స్పందించింది. చమురు రవాణాకు కీలకమైన ఈ హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా బలగాలను ఎదుర్కొనేందుకు వేచి చూస్తున్నామని ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ) హెచ్చరించింది. హోర్ముజ్ మీదుగా చమురు నౌకలకు రక్షణగా తమ బలగాలు వెళతాయని అమెరికా ఇంధన మంత్రి క్రిస్ రైట్ ప్రకటించారు. ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనీ మీడియాతో మాట్లాడుతూ, అమెరికా ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి ముందు 1987లో సూపర్ ట్యాంకర్ బ్రిడ్జిటన్‌కు జరిగిన ప్రమాదాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే ఇటీవల ఆ దేశ చమురు ట్యాంకర్లను కూడా తాము లక్ష్యంగా చేసుకున్నామని గుర్తు చేశారు. 1987లో కువైట్‌కు చెందిన బ్రిడ్జిటన్ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా వెళుతుండగా నాటి ఉద్రిక్తల కారణంగా అమెరికా నౌకాదళం ఆ నౌకకు రక్షణ కల్పించింది. ఆ నౌకను ఐఆర్జీసీ లక్ష్యంగా చేసుకుంది. ఫార్సీ దీవుల సమీపంలో నౌక వెళ్లే మార్గంలో నీటి అడుగున పేలుడు పదార్థాలను ఏర్పాటు చేసి దాడికి పాల్పడింది. అయితే ఈ పేలుడులో నౌక దెబ్బతిన్నప్పటికీ ప్రయాణంలో ఇబ్బంది రాలేదు. మొత్తానికి లక్ష్యాన్ని చేరుకుంది.

# ప్రాజెక్టుల నాణ్యతలో రాజీ పడొద్దు: సీఎం చంద్రబాబు

అమరావతి: ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం, వెలిగొండ, హంద్రీ-నీవా, చింతలపూడి లిఫ్ట్ సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిపై ఆయన అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కీలకమైన పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ దెబ్బతిన్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. "దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేస్తే సరిపోతుందని నిపుణులు నివేదికలు ఇచ్చినా, నాణ్యత, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఝుంఝూవతి రబ్బర్ డ్యాం కొట్టుకుపోయిన ఘటనను గుర్తు చేస్తూ, నిర్మాణాల్లో నాణ్యతా లోపాలను సహించేది లేదన్నారు. తమ ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి ఎప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్, వరికపూడిశెల లిఫ్ట్, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులపైనా ఈ సమీక్షలో చర్చించారు.


# చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయనని, అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామని అన్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక రేషన్ కార్డులు ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే సన్న బియ్యం ఇచ్చామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఫామ్ హౌస్‌లో పడుకునే వారికి పేదవారి కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. మన ప్రాంతాన్ని మనం అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అందర్నీ కలుపుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తానని ముఖ్యమంత్రి అన్నారు.

# రాజ్యసభకు తెలంగాణ కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవం!



హైదరాబాద్: తెలంగాణ నుంచి ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల ఎన్నిక లాంఛనంగా మారింది. బరిలో ఉన్న ఏకైక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో వీరికి పోటీ లేకుండా పోయింది. రాజ్యసభ ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థికి 10 మంది ఎమ్మెల్యేలు మద్దతుగా ప్రతిపాదించాల్సి ఉంటుంది. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కాంతే సాయన్న నామినేషన్ పత్రాలకు తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేదని రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి నిర్ధారించి, దానిని తిరస్కరించారు. మరోవైపు, తగిన సంఖ్యాబలం లేకపోవడంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. దీంతో కాంగ్రెస్ అభ్యర్థులిద్దరే బరిలో మిగిలారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంది. ఆ సమయం ముగిసిన వెంటనే, సింఘ్వీ, నరేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించి, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అయిన అభిషేక్ మను సింఘ్వీకి తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించడం ఇది రెండోసారి. ఇక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, రాజకీయ వ్యూహకర్తగా పేరున్న వేం నరేందర్ రెడ్డి తొలిసారిగా పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు.

# ప్రపంచంలో పేరున్న పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొస్తున్నాం

మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగాల కల్పన, వైద్య, విద్య తదితర రంగాలపై శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు.

గత పాలనలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయింది

అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'2019-24 మధ్య ఏపీ బ్రాండ్ పూర్తిగా దెబ్బతిన్నది. జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి కంపెనీలు రాష్ట్రాన్ని వదిలిపెట్టి పోయాయి. వైసీపీ ఉన్నంత వరకూ ఏపీకి తిరిగి రామని చెప్పి మరీ ఆ కంపెనీలు వెళ్లిపోయాయి. పూర్తిగా నెగెటివ్ ఇమేజ్‌ని సృష్టించి గత పాలకులు వెళ్లారు. 2019-20 నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 913 కంపెనీలు మూతపడినట్టు ఆర్బీఐ నివేదికలో పేర్కొంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ ఉంది. 26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల చేశాం. ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లు అభివృద్ధి చేస్తున్నాం. 2047కు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ తయారవుతుంది. విశాఖ ఐటీ, జీసీసీల కేంద్రంగా తయారవుతుంది. ఎవరూ ఊహించనన్ని పెట్టుబడులు విశాఖకు వచ్చాయి' అని ముఖ్యమంత్రి అన్నారు.

పేరున్న పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి

'అమరావతికి క్వాంటం లాంటి ఎకోసిస్టం వస్తోంది. తిరుపతిని కూడా స్పేస్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్సు పరిశ్రమలతో అభివృద్ధి చేస్తాం. గూగుల్, టాటా- టీసీఎస్ లాంటి పెద్ద కంపెనీలు విశాఖకు వచ్చాయి. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ వస్తోంది. 20 నెలల్లోనే ప్రపంచంలోనే పేరున్న పరిశ్రమలు కంపెనీలు ఏపీకి వచ్చాయి. ఈ నెలలో ఆర్సెలార్ మిట్టల్, వచ్చే నెలలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. ఏఎం గ్రీన్ ద్వారా గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి కూడా శ్రీకారం చుట్టాం. ఎన్టీపీసీ ద్వారా 1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ తయారీ కోసం కూడా ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. టాటా సంస్థ కూడా రూ.6 వేల కోట్ల పెట్టుబడులతో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఇలా ప్రముఖ సంస్థలన్నీ రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. భవిష్యత్తులో ఈ పెట్టుబడులను సుస్థిరం చేయడానికి పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయిన పరిస్థితి. పెట్టుబడులకు ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా ఏపీ మారుతుంది. ఎన్డీఏ పాలన ఉన్నంత కాలం ఏపీకి పారిశ్రామిక వేత్తలు క్యూ కడతారు. దీనిని భరించలేక వైసీపీ నెగటివ్ ప్రచారాన్ని మొదలు పెట్టింది పెట్టుబడులు అంటే విముఖత చూపిస్తున్నట్టుగా దుష్ప్రచారం చేస్తున్నారు' అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

## ఆవిష్కరణలు, నైపుణ్యాలకు పదును పెడుతున్నాం

'ఏపీ అంటే పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించాం. ఏపీ అంటే బ్రాండ్ అనే పేరు మళ్లీ తీసుకువచ్చాం. భారత్‌లో తొలి క్వాంటం కంప్యూటర్ వ్యాలీ అమరావతికి వచ్చింది. అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతి క్వాంటం వ్యాలీకి అడ్రస్‌గా మారుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ ద్వారా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా రాష్ట్రంలోని 5 జోన్లలో ఆవిష్కరణలకు, నైపుణ్యాలకు పదును పెడుతున్నాం. గత ప్రభుత్వంలో ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేక పోయారు. మా ప్రభుత్వంలో మానవ వనరులను అభివృద్ధి చేయటంతో పాటు అత్యుత్తమ ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపడుతుంది' అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

మెడికల్ కాలేజీల నిర్మాణానికి భూమి చూపించలేదు

'దేశంలోనే తొలిసారి ప్రజలందరికీ వర్తింపచేసేలా యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నాం. రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఈ విధానం ఉంటుంది. అతి తక్కువ వ్యయంతోనే వైద్య చికిత్సలు అందేలా చర్యలు చేపడుతున్నాం. పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడుతున్నాం. గత పాలకులు కనీసం వైద్య కళాశాలలకు భూమి కూడా చూపించలేదు. ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పీపీపీ అంటే ప్రైవేటు కాదని మరోమారు ప్రజలకు చెబుతున్నాం. ఇది పూర్తిగా ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. అన్ని మెడికల్ కళాశాలల్లోనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సేవలు అందుతాయి. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నాం. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం' అని సీఎం స్పష్టం చేశారు.

తెలుగును కాపాడే బాధ్యత తీసుకుంటాం

'విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ఏటా రాష్ట్రంలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగులతో సమీక్షించుకుంటున్నాం. గత పాలకుల వల్ల విద్యా రంగం దిగజారి పోయింది. ప్రాథమిక విద్య ఎక్కడైనా మాతృభాషలోనే ఉంటుంది. ప్రపంచానికి తెలివైన యువతను అందించటంతో పాటు తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

ప్రముఖ కంపెనీలతో పర్యాటక ప్రాజెక్టులు అనుసంధానం

'అతిథి దేవోభవ అన్నది మన విధానం. దీనిని అనుసరించే పర్యాటక విధానాన్ని రూపొందించాం. ప్రకృతి వనరులకు మన రాష్ట్రంలో కొదవలేదు. భూకేటాయింపులు సహా వివిధ ప్రోత్సాహకాలను ప్రాజెక్టులకు అందిస్తున్నాం. పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా పర్యాటక పాలసీకి రూపకల్పన చేశాం. 102 ఎంఓయుల ద్వారా రూ.18 వేల కోట్ల పెట్టుబడులు కూడా రాష్ట్రానికి వచ్చాయి. 3.4 లక్షల మందికి దీని ద్వారా ఉద్యోగాలు వస్తాయి. 7,348 హోటల్ గదుల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చాం. సూర్యలంక బీచ్‌ను గోవాతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం. అఖండ గోదావరి, పాపికొండలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం. గండికోట మన దేశపు గ్రాండ్ కాన్యన్. దీనిని కూడా అద్భుతంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ప్రసాద్ స్కీమ్ కింద వివిధ దేవాలయాలను కూడా అభివృద్ధి చేయబోతున్నాం. కారావాన్, హోం స్టేలు, టెంట్ సిటీల ద్వారా పర్యాటకాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నాం. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో వీటిని అనుసంధానించి పర్యాటక ప్రాజెక్టులు పెద్ద ఎత్తున తీసుకు వస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఎక్సైజ్‌లో కుంభకోణానికి పాల్పడ్డారు

'గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో అతిపెద్ద కుంభకోణం చేశారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీని వేసి విచారణ చేస్తున్నాం. సొంత బ్రాండ్లు తెచ్చి వ్యాపారం చేసి ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారు. ఇప్పుడు మొత్తం పారదర్శకంగా మార్చి అంతర్జాతీయ బ్రాండ్లు తీసుకువచ్చాం. ఎవరు తప్పు చేసినా కఠినంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్యమే మాకు అత్యంత ప్రాధాన్యం. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం సేవించి 30 వేల మంది వరకూ అనారోగ్యాల పాలై మరణించారు. ప్రస్తుతం ఎక్సైజ్ విధానాన్ని ప్రక్షాళన చేశాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో అన్నారు.

# చంద్రబాబు అసెంబ్లీలో తప్పుడు లెక్కలు చెప్పారు

మొదటి పేజి తరువాయి

బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ, కార్పొరేషన్ల ద్వారా పొందుతున్న రుణాలను మాత్రం దాచిపెడుతోందని విమర్శించారు. కేవలం రెండు నెలల్లోనే రూ. 57 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నివసిస్తున్న కరకట్ట నివాసం యాజమాన్యంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని నాని డిమాండ్ చేశారు. అది లింగమనేని రమేశ్ దా? సీఆర్డీయేదా? లేక చంద్రబాబుదా? అన్నది వెల్లడించాలని ప్రశ్నించారు. అలాగే విశాఖలోని గీతం యూనివర్సిటీ ఆక్రమించిన వేల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా క్రమబద్ధీకరిస్తోందని ఆరోపించారు. తిరుమల లడ్డూ వివాదంపై స్పందిస్తూ, ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని పేర్ని నాని విమర్శించారు. గతంలో జంతువుల కొవ్వు కలిపారని ఆరోపించిన పవన్ కల్యాణ్, ఇప్పుడు అసెంబ్లీలో ఆ మాట మార్చారని ఎద్దేవా చేశారు. హెరిటేజ్ సంస్థ ద్వారా నెయ్యి సరఫరా జరిగిన అంశంపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. వీటికి తోడు రైతులకు రుణమాఫీ, సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, గతంలో తాము నిర్మించిన ఇళ్లనే ఇప్పుడు కొత్తగా ప్రారంభించబోతున్నారని ఆయన దుయ్యబట్టారు.

# గద్దర్ అవార్డుల ప్రకటన..




2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

స్పెషల్ అవార్డులు:

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి, ఏఎన్నార్ అవార్డు - జయసుధ, పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్, నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనిదత్

ఫీచర్ ఫిల్మ్:

ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి, ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా, ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో, ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్), ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్), ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి), ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో), ఉత్తమ సహాయ నటుడు - శివాజీ, ఉత్తమ సహాయనటి - భూమిక (యూఫోరియా), బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్,

ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా - కోర్ట్, ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం, ఉత్తమ డాక్యుమెంటరీ - యూనిటీ, బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్), ఉత్తమ బాలల చిత్రం - అనగనగా, ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా), ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి), ఉత్తమ గాయని - సాహితీ (కన్నప్ప), ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా), ఉత్తమ స్క్రీన్‌ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం), ఉత్తమ లిరిసిస్ట్ - నందకిశోర్ (కుబేర), ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్), ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్)., ఉత్తమ సినీ గ్రంథం: ప్రభు (శూన్యం నుండి శిఖరాగ్రాలకు), ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు.

# రేవంత్ రెడ్డికి అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ ఆహ్వానం

ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా అందరికీ నాణ్యమైన వైద్యం అందించే 'యూనివర్సల్ హెల్త్ కేర్' విధానంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక యుగంలో అతి ముఖ్యమైన అంశాలైన సమాచార భద్రత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంలో పాటించాల్సిన నిబంధనలపై కూడా ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని, ఇక్కడి మౌలిక సదుపాయాలను అభినందించిన గవర్నర్ మాట్ మేయర్, భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య ఆర్థిక మరియు సాంకేతిక బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇదే క్రమంలో, తెలంగాణ నుండి ఒక అధికారిక ప్రతినిధుల బృందంతో కలిసి డెలావర్ రాష్ట్ర పర్యటనకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొని, రెండు రాష్ట్రాల మధ్య కుదుర్చుకోబోయే భవిష్యత్ ఒప్పందాల గురించి ప్రాథమిక చర్చలు జరిపారు.

# భవిష్యత్‌లో అనేక దేశాలకు మన విద్యుత్: చంద్రబాబు

దిల్లీ: అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. " ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయి" అని చంద్రబాబు అన్నారు .


# సోషల్ మీడియా వల్ల మహిళలపై వేధింపులు పెరిగాయి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: సోషల్ మీడియా వల్ల మహిళలపై వేధింపులు పెరిగాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రత కోసం కేవలం చట్టాలు చేయడం మాత్రమే కాదని వాటిని అమలు చేసి తీరాలని అన్నారు. మహిళల భద్రత కోసం పురుషులు ముందుకు రావాలనే సందేశంతో తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గతంలో మహిళలపై వేధింపులు పట్టణాలకే పరిమితమయ్యేవని ఇప్పుడు వాటి పరిధి పెరిగిందని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని పథకాలు మహిళల పేరు మీదే అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో వెయ్యి బస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, అందుకే వారి ప్రతిభను గుర్తించి తమ ప్రభుత్వం మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. హైటెక్ సిటీ వంటి ఖరీదైన ప్రాంతం పక్కన మహిళా ఉత్పత్తుల విక్రయం కోసం ఇందిరా మహిళా స్టాల్స్‌కు స్థలం కేటాయించినట్లు తెలిపారు. గ్రామీణ మహిళల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తూ, వారి ఉత్పత్తులను ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ ద్వారా విక్రయించేలా ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణను అగ్రస్థానంలో నిలపడంలో మహిళల కృషి ఎంతో ఉందని అన్నారు. మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారికి అన్ని వేళలా అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

# 'కేరళ స్టోరీ' సినిమాను ఎవరూ చూడటం లేదన్న రాహుల్ గాంధీ... బీజేపీ ఎంపీ భార్య కౌంటర్

ఢిల్లీ: 'ది కేరళ స్టోరీ-2' చిత్రాన్ని ఎవరూ చూడటం లేదని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. రాజకీయ లబ్ధి కోసం కొంతమంది ఈ చిత్రాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. నిజమైన కేరళ సంస్కృతి, సంప్రదాయాలు ఏమిటో ఈ దేశ ప్రజలందరికీ తెలుసని అన్నారు. కానీ సమాజంలో విద్వేషాలు పెంచడానికి, కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడానికి కొందరు వ్యక్తులు సినిమాలను, మీడియాను ఆయుధంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుంటున్నారని, అలాంటి కార్యకలాపాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కూడా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవతలి వారికి సమాధానం చెప్పడానికి కూడా అవకాశం ఇవ్వరని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ స్పందించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సురభి తివారీ తప్పుబట్టారు. ఇంట్లో కూర్చుని ఇలాంటి మాటలు మాట్లాడటం సరైన విధానం కాదని హితవు పలికారు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూశాక, దానికి సంబంధించిన డాక్యుమెంట్లు, కేసులు చదివిన తర్వాత అది నిజమో కాదో ప్రజలే తేల్చుకుంటారని అన్నారు.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి గల్ఫ్ దేశాలకు సారీ చెప్పిన ఇరాన్ ప్రధాని




ఢిల్లీ: అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.



## చిత్తూరు జిల్లా నగిరి రూరల్ అన్నపూర్ణేశ్వర సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం.

బుగ్గ గుడి లో ఈరోజు అన్నదాన కార్యక్రమం దాత నరసింహులు శెట్టి కుటుంబ సభ్యులతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు మరియు గ్రామస్తులు ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్, అటెండర్ పూజారి అందరూ దగ్గరుండి ఈ అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## ఆయిల్ ఫామ్ ఉత్తమ సాగు పద్ధతులపై రాజపూడిలో రైతులకు అవగాహన సదస్సు




కాకినాడ జిల్లా జగ్గంపేట మార్చి 07 నేటి శుభోదయ: జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పెద్దాపురం వారి ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా పతంజలి ఫుడ్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డి. జి. మ్ ) ఎ.యస్ ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ చాలా అనుకూలమైన లాభదాయకయమైన పంట అని, సమగ్ర యాజమాన్య పద్ధతులు మరియు ఫెర్టిగేషన్ ఉపయోగించినట్లాయితే అధికాలాభాలు పొందవచ్చు అని తెలిపారు.హార్టికల్చర్ ఆఫీసర్ ఎ శ్రీవల్లి ఆయిల్ పామ్ సాగు పై ప్రభుత్వ ఇస్తున్న మొక్క రాయితీలు, డ్రిప్ సబ్సిడీ, అంతర పంటలు గురించి వివరించడం జరిగింది.తరువాత టెక్నికల్ ఫీల్డ్ ఆఫీసర్ సి.హెచ్ దుర్గా ప్రసాద్ ఆయిల్ పామ్ లోని యాజమాన్యం, యంత్రికరణ పద్ధతులు,చీడ పీడలు,తెగుళ్ళు,మల్చించ్, గెలల నాణ్యత, పెర్టిగేషన్ తదితర విషయాలపై అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు,డి.మ్ వై శ్రీనివాస్,క్లస్టర్ ఆఫీసర్ జె చక్రబాబు, క్లస్టర్ ఇంచార్జ్ కె రామకృష్ణ , సూపెర్వైసర్ పి.శివ,జి.తమ్మారావు, ఆర్. గణేష్ , వి రాజా, మరియు ఇతరులు పాల్గొనడం జరిగింది.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా "అంతర్జాతీయ మహిళా దినోత్సవం"

"అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఆరోగ్య అవగాహన సదస్సు "




కాకినాడ జిల్లా, జగ్గంపేట మార్చ్ 07 నేటి శుభోదయ :జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో మహిళా సాధికారత సెల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట డా డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డా. టి.వి. లలిత కుమారి , అతిధులుగా జగ్గంపేట సాయి హాస్పిటం చెందిన వైద్య నిపుణులు డా. ఎ. సుగంధి (జనరల్ మెడిసిన్), డా.కె. సౌమ్య ప్రవంతి (ఎం.ఎస్, ఆర్థోపెడిక్), డా. జె. వైష్ణవి (గైనకాలజిస్ట్) విచ్చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ ఈ రోజు మనం జరుపుకుంటున్నది ప్రపంచవ్యాప్తంగా అత్యంత ముఖ్యమైన రోజు- అంతర్జాతీయ మహిళా దినోత్సవం. మహిళలు కేవలం కుటుంబానికి మాత్రమే కాదు, సమాజ అభివృద్ధికి కూడా ప్రధాన శక్తి. ఒక మహిళా చదువుకుంటే ఒక కుటుంబం అభివృద్ధి చెందుతుంది, ఒక సమాజం ముందుకు సాగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జగ్గంపేట డా. బి. ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డా. జి.వి. లలిత కుమారి మాట్లాడుతూ, చరిత్రలో ఎన్నో మహిళలు తమ ప్రతిభతో ప్రపంచాన్ని మార్చారు అని, రాజకీయ, ఆర్థిక, వైద్య, విద్య, క్రీడా రంగాలలో మహిళలు ప్రతిభ చాటారని తెలియజేశారు.ఈ సందర్భంగా సాయి హాస్పిటల్, జగ్గంపేట కు చెందిన వైద్య నిపుణులు విద్యార్థినులకు వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. డా. ఎ. సుగంధి (జనరల్ మెడిసిన్) సీపీఆర్ (జూ=) విధానం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే విధానాలు మరియు పాము కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరంగా తెలియజేశారు. డా. కె. సౌమ్య శ్రావంతి (ఎం.ఎస్. ఆర్థోపెడిక్) ఎముకల ఆరోగ్యం, సరైన పోషకాహారం మరియు వ్యాయామం ప్రాముఖ్యతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే డా. జె. వైష్ణవి (గైనకాలజిస్ట్) మహిళల గైనకాలజికల్ ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణ గురించి వివరించారు.కళాశాల మహిళా సాధికారత సెల్ కన్వీనర్ డా. డి. సత్యలత. మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, సాధికారతపై అవగాహన కార్యక్రమాలు విద్యార్థినుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ బాలరాజు , ఐ. క్యూ.ఏ. సి కో-ఆర్డినేటర్ డా.పి.వి.వి. సత్యా నారాయణ, అకడెమిక్ కో-ఆర్డినేటర్ డా.జి. సురేష్ , కెమిస్ట్రీ ఆద్యాపకులు వి. మల్లికార్జున శర్మ , తెలుగు ఆధ్యాపకులు డా. డి. సత్యలత, గణిత ఆధ్యాపకులు సి. హెచ్. ఝాన్సీదేవి, ఫిజిక్స్ ఆద్యాపకులు వి. గోపాలకృష్ణ, కామర్స్ ఆద్యాపకులు పి.పద్మ శేఖర్ మరియు కె.వెంకట రావు, జువాలజీ ఆద్యాపకులు పి.శ్రీనివాస రావు, బోటని ఆధ్యాపకులు పి.నవీన , కంప్యూటర్ ఆధ్యాపకులు వి. దేవి ప్రసన్న, ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్ధిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## - తెలుగు రాష్ట్రాల్లో పడిపోయిన కోడిగుడ్ల ధరలు

- ఒక గుడ్డు ధర రూ.3.50 పైసలే



హైదరాబాద్, అమరావతి, నేటి శుభోదయ ::: కోడిగుడ్డు ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది.మొన్నటిదాకా పెరిగిన ధరలు ఇప్పుడు హాఫ్ రేటుకు పడిపోతుండటంతో పౌల్ట్రీ యజమానులు ఆందోళన అంతా ఇంతా కాదు.అమెరికా-ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పౌల్ట్రీ రంగంపై తీవ్ర ప్రభావాన్ని కబనరుస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం కారణంగా అంతర్జాతీయ రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.ప్రధానం గా మిడిల్ ఈస్ట్ (మధ్య ప్రాచ్యం) దేశాలకు జరిగే ఎగుమతులు పూర్తిగా నిలిచిపోవడంతో దేశీయంగా కోడిగుడ్ల నిల్వలు భారీగా పేరుకు పోయాయి. దీని ప్రభావంతో గుడ్ల ధరలు దారుణంగా పడిపోయి పౌల్ట్రీ రైతులు తీవ్ర నష్టాల బారిన పడుతున్నారు.ఈ సంక్షోభం కారణంగా పౌల్ట్రీ రంగానికి రోజుకు దాదాపు రూ. 5 కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నట్లు మార్కెట్ వర్గాల అంచనాగా ఉంది.సాధారణంగా ఎగుమతులు సాఫీగా సాగే సమయంలో గుడ్డు ధర ఆశాజనకంగానే ఉంటుంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఒక్కో గుడ్డు ధరను రూ. 4.30గా నిర్ణయించినప్పటి కీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. డిమాండ్ లేకపోవడంతో స్థానిక మార్కెట్లలో ఒక్కో గుడ్డు కేవలం రూ. 3.50 మాత్రమే పలుకు తోంది. కొన్ని ప్రాంతాల్లో ధర ఇంతకంటే తక్కువగా ఉండటంతో ఉత్పత్తి వ్యయం కూడా రాక పౌల్ట్రీ రైతులు లబోదిబోమంటున్నారు. యుద్ధ మేఘా లు త్వరగా తొలగని పక్షంలో రానున్న రోజుల్లో ఎగుమతులు మరింతగా దెబ్బ తిని ధరలు ఇంకా పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరి స్తున్నారు. ఇప్పటికే వేసవి కాలం సమీపిస్తుండటం గుడ్ల వినియోగం కాస్త తగ్గే అవకాశం లేకపోలేదు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీ యజమాను ల్లో ఆందోళన అంతకంతకు పెరుగుతోంది. దీనిపై ప్రభుత్వాలు స్పందించి ఎగుమతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, తమను ఆదుకోవా లని పౌల్ట్రీ యజమానులు కోరుతున్నారు.

## - మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వర పరిష్కారం : రాష్ట్ర హైకోర్టు జడ్జి, తెలంగాణ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కేంద్ర మెంబర్, బోర్డ్స్ ఆఫ్ గవర్నర్స్ సూరేపల్లి నంద

- మీడియేటర్లు నిష్పక్షపాతంగా, గోప్యంగా వ్యవహరించాలి
- సెక్షన్ 89 సిపిసి ద్వారా కోర్టులు మీడియేషన్ కు కేసులు రిఫర్ చేయాలి
- ఖమ్మం న్యాయ సేవా సదన్ లో న్యాయవాదులకు నిర్వహిస్తున్న 40 గంటల మీడియేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన హైకోర్టు జడ్జిలు





ఖమ్మం, ఖమ్మం లీగల్, నేటి శుభోదయ ::: మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వర పరిష్కారం లభిస్తుందని, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి, తెలంగాణ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కేంద్ర మెంబర్, బోర్డ్స్ ఆఫ్ గవర్నర్స్ సూరేపల్లి నంద తెలిపారు.రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, తెలంగాణ మీడియేషన్ అండ్ ఆర్బిట్రేషన్ కేంద్ర మెంబర్, బోర్డ్స్ ఆఫ్ గవర్నర్స్ సూరేపల్లి నంద, కె. శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ జి. రాజగోపాల్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సిహెచ్. పంచాక్షరి లు శనివారం ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ లో న్యాయవాదుల కోసం నిర్వహిస్తున్న 40 గంటల మీడియేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద మాట్లాడుతూ కోర్టులలో పెరిగిపోతున్న పెండింగ్ కేసుల దృష్ట్యా మీడియేషన్ ద్వారా కొన్ని సమస్యలను ఇరు పక్షాలు స్నేహ పూరిత వాతావరణంలో పరిష్కరించుకోవడం చాలా కీలకమని అన్నారు. మీడియేషన్ ద్వారా త్వరగా న్యాయం లభించడంతో పాటు ఇరు పక్షాల మధ్య ఉన్న సంబంధాలు పాడవకుండా ఉంటాయని చెప్పారు. మీడియేషన్ యాక్ట్ ద్వారా ఈ ప్రక్రియకు చట్టబద్ధత కల్పించడం జరిగిందని అన్నారు. న్యాయవాదులకు మీడియేషన్ పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 40 గంటల కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మీడియేషన్ లో ఇరు పక్షాలు స్వచ్ఛందంగా పాల్గొనాల్సి ఉంటుందని, మీడియేటర్ తప్పనిసరిగా నిష్పక్షపాతంగా, గోప్యంగా వ్యవహరించాలని తెలిపారు. మీడియేషన్ కు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, న్యాయబద్ధంగా ఉన్న అంశాలు న్యాయవాదులకు తెలిపేందుకు ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, వ్యాపార విభేదాలు, సేవలకు సంబంధించిన కేసులు, చైల్డ్ కస్టడీ, తల్లితండ్రుల మేయింటెనెన్స్ కేసుల వివాదాలు మీడియేషన్ ద్వారా వేగంగా పరిష్కరించుకునే ఆస్కారం ఉంటుందని, క్రిమినల్ కేసులు, తీవ్రమైన ఆరోపణలు ఉన్న కేసులు మీడియేషన్ చేయరాదని అన్నారు. మీడియేటర్లు చాలా ఓపికతో ఇరుపక్షాల వాదనలు పూర్తిగా విని, ఇరు పక్షాలకు విన్ విన్ పొజిషన్ ఉండే విధంగా, ఇరు పక్షాలు అంగీకరించేలా సమస్య పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. సెక్షన్ 89 సిపిసి ప్రకారం మీడియేషన్ ద్వారా పరిష్కృతం అయ్యే కేసులను కోర్టులు రిఫర్ చేయాలన్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి కె. శరత్ మాట్లాడుతూ చిన్న, చిన్న కారణాలతో కేసులు చాలా రోజుల పాటు పెండింగ్ ఉంటున్నాయని, అటువంటి కేసులు లిటిగేషన్ పెంచకుండా మీడియేషన్ ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. మీడియేషన్ ఇరు వర్గాల అంగీకారంతో జరగాలని, ఏ ఒక్కరిని బెదిరించరాదని అన్నారు. రాష్ట్రంలో 10 శాతం మేరకు కేసులు మీడియేషన్ ద్వారా పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ స్టేట్ సెక్రటరీ పంచాక్షరీ మాట్లాడుతూ మీడియేషన్ నిర్వహించేందుకు ఆసక్తి కల్గిన 600 మంది న్యాయవాదులకు ఇప్పటివరకు శిక్షణ అందించామని, నేడు మరో 50 మంది న్యాయవాదులకు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 19 సంవత్సరాల అనుభవం గల మాస్టర్ ట్రైయినర్ లతో న్యాయ వాదులకు శిక్షణ అందుతుందని పేర్కొన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలలో మీడియేషన్ మన కంటె చాలా ముందు ఉన్నదని తెలిపారు. మీడియేషన్ ద్వారా న్యాయవాదులకు కూడా ఆదాయం లభిస్తుందని అన్నారు.ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి. రాజగోపాల్ మాట్లాడుతూ చెన్నై నుంచి మాస్టర్ ట్రైయినర్లు న్యాయవాదులకు మీడియేషన్ కేసులు డీలింగ్ లో ప్రాక్టికల్ స్కిల్స్ అందించేందుకు వచ్చారని తెలిపారు. ఈ శిక్షణ వల్ల కుటుంబ వివాదాలు, మోటారు వెహికల్ ప్రమాదాల కేసులు, సివిల్ కేసులు లిటిగేషన్ పెంచకుండా ఏ విధంగా పరిష్కరించాలో అవసరమైన స్కిల్స్ అందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్, జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కృతిక శుక్లాకు కృతజ్ఞతలు తెలిపిన పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కుక్కమూడి ప్రసాద్



నేటి శుభోదయ 07 పల్నాడు జిల్లా నరసరావుపేట :పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తిక శుక్లాకు పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మరియు దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ బాధితురాలు సూర్ల స్టెల్లా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పల్నాడు జిల్లా నరసరావుపేట లోని కలెక్టర్ కార్యాలయం నందు కుక్కమూడి ప్రసాద్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట ఏఎంజీ లో ఉంటూ రెండు చేతులు కాళ్లు లేని స్టెల్లాతో కలెక్టర్ కృత్తికా శుక్లాను కలిసి 15వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయించాలని, 35 కేజీల బియ్యం ఇచ్చేలా చూడాలని, నివేశన స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ పలు సమస్యలతో కూడిన అర్జీని ఆమెకు అందజేశారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి 21న స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా వినుకొండకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడును ప్రజా వేదిక వద్ద బాధితురాలైన స్టెల్లా కలిసి పై సమస్యలను పరిష్కరించాలని, మానసికంగా,ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టులాడుతున్నానని విన్నవించుకోగా, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఆమె సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కు చెప్పారు. దానిలో భాగంగా ఈరోజు కలెక్టర్ ను కలవడం జరిగిందని ఈ సమస్యలపై కలెక్టర్ కృతిక శుక్ల సానుకూలంగా స్పందించి ఇంటి పట్టా ఇవ్వాలని, 35 కేజీలు బియ్యం ఇచ్చే విధంగా చూడాలని, ఆమె చేయగలిగిన ప్రభుత్వ ఉద్యోగం త్వరలో ఇచ్చే విధంగా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో వికలాంగు రాలైన స్టెల్లా సమస్యలను పరిష్కరించిన పల్నాడు జిల్లా కలెక్టర్ కు అభినందనలు కృతజ్ఞతలు వారు తెలిపారు.ఈకార్యక్రమంలో ఏపీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు, పల్నాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్(బాండెడ్ లేబర్) చింతపల్లి లాజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైజస్ రామదేవ్, ప్రభావతిల కుమారుని ఉపనయన మహోత్సవం..!!

- కార్యక్రమానికి హాజరై ఆశీస్సులు అందజేసిన ఎమ్మెల్యే సతీమణి శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, కోరుకొండ యోగ అసోసియేషన్ సీనియర్ నాయకులు వైజస్ రామదేవ్, ప్రభావతిల కుమారుని ఉపనయన మహోత్సవం మండలంలోని బూరుగుపూడి గేటు సమీపంలో గల కళ్యాణమండపంలో వైభవంగా జరిగింది. శుక్రవారం అతిరథ మహారథులు, బంధుమిత్ర శ్రేయోభిలాషుల సమక్షంలో రామదేవ్, ప్రభావతిల కుమారుడు గాయత్రి ఫణీంద్ర ఉపనయన (వడుగు) శుభకార్యాన్ని వేద పండితుల సారధ్యంలో మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తం నిర్వహించారు. కోరుకొండ, రాజమండ్రి పరిసర గ్రామాలకు చెందిన ప్రముఖులు, బంధుమిత్ర శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమానికి హాజరై గాయత్రీ ఫణీంద్ర ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ 'నా సేన కోసం నా వంతు' రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి ప్రత్యేకంగా హాజరై ఆశీస్సులు అందజేశారు. అలాగే సీనియర్ నాయకులు ఎన్.ఎస్.ఎస్. చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు కటకం చలం, సర్పంచులు నక్క రాంబాబు, శ్రీమతి కర్రి లక్ష్మీ సరోజా గణేష్, విరియాల రాంబాబు, విరియాల శేష బదిరెడ్డి దొర, రామ తులసి, మాజీ సర్పంచులు నీరుకొండ బాబ్జి, వాకా నరసింహారావు, పరస శ్రీనివాస్, పచారి నరసింహ మూర్తి, దాసెట్టి శ్రీనివాస్, సూరంపూడి సూరిబాబు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బ్రాహ్మణ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 27 'శ్రీ రామ శోభాయాత్ర' విజయవంతానికి కార్యశాల..

- వివిధ అంశాలపై మార్గనిర్దేశనం చేసిన నేతలు..
- ఉగాదికి ప్రతి ఇంటిపై కాషాయ ధ్వజం ఎగిరేలా చూడాలి..




రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);ఈనెల 27వ తేదీన శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బైక్ ర్యాలీకి సంబంధించి కార్యశాల నిర్వహించారు. ఆర్ ఎస్ ఎస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, ఉత్సవ సమితి అధ్యక్షుడు పతివాడ రామరాజు, కార్యదర్శి యడ్లవలి అయ్యప్ప స్వామి, పిక్కి నాగేంద్ర, పుల్ల రాజశేఖర్, కురగంటి సతీష్, వనవాసి కళ్యాణ్ యోజన పద్మావతి, సోముజీ, జగదీష్ రాజ్ పురోహిత్, కర్రి శ్రీనివాస్, పి. గోపాల రెడ్డి, బొమ్ముల రవిచంద్ర, బెజ్జవరపు రవి, ప్రదీప్, లీలా శంకర్, బజరంగ్దళ్ ప్రదీప్ యాదవ్, జై కృష్ణ, గోరక్షణ సమితి దమ్ము మహేష్, సత్య, ఉమా శంకర్ తదితరులు హాజరయ్యారు.




ఎవరెవరు ఏ ఏ పనులు పంచుకోవాలి, ఏవిధంగా చేయాలి, శోభాయాత్ర విజయవంతం కోసం ఇప్పటినుంచే ఎలాంటి ప్రచారం చేయాలి, క్రమశిక్షణతో ర్యాలీ సాగేందుకు ఏవిధంగా వ్యవహరించాలి వంటి అంశాలపై ఓలేటి, పతివాడ మార్గనిర్దేశనం చేసారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రతియేటా నిర్వహించే శోభాయాత్రకు మంచిస్పందన వస్తోందని, ఈసారి మరిన్ని జాగ్రత్తలు తీసుకుని విజయవంతం చేయాలనీ సూచించారు. ర్యాలీ ప్రారంభించడానికి వెళ్లడానికి మధ్యలో ఉండే వాహనాలు అడ్డుగా ఉండడం వలన చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందని, అందుచేత తగిన మార్గం ఉండేలా ముందునుంచీ జాగ్రత్తలు తీసుకోవాలని, రూట్ మ్యాప్ కి అనుగుణంగా క్రమశిక్షణతో ర్యాలీ సాగేలా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ఉగాది పురస్కరించుకొని ప్రతి ఇంటి మీద కాషాయం జెండా ఎగరవేయాలని పేర్కొన్నారు.

## ఆదరణ'తో శాశ్వత ఉపాధి

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



విజయవాడ, మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :ఆదరణ 3.0 పథకం బీసీ కుల వృత్తులకు శాశ్వత ఉపాధ కల్పించనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత స్పష్టంచేశారు. కురుమ, కురుబల అభివృద్ధి సీఎం చంద్రబాబు, టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీల ఉన్నతికి గతంలో ఎన్నడూ కేటాయించని విధంగా భారీ ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను గుంటూరు జిల్లాకు చెందిన కురుమ సామాజిక వర్గీయులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి ఆవిర్భావం నుంచి టీడీపీ కృషి చేస్తోందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్, ప్రస్తుతం సీఎం చంద్రబాబు బీసీలకు అన్నింటా అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత బీసీలకు ప్రాధాన్యం లభిస్తోందన్నారు. రాజకీయంగా మరింత గుర్తుంపు లభించిందన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో ప్రారంభించబోయే ఆదరణ 3.0 పథకంలో బీసీలకు అధునాత పరికరాలు అందిస్తూ, శాశ్వత ఉపాధి కల్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికులు రూపొందిస్తున్నామన్నారు. బీసీ విద్యార్థుల కోసం హాస్టళ్ల రక్షణతో పాటు నాణ్యమైన ఆహారంతో కూడిన విద్య అందిస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు మర్రి వెంకటసత్యనారాయణ, తట్టి అర్జునరావు, బి.ఉమా మహేశ్వరరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఈనెల 16న పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

**58 అడుగుల ఎత్తులో అమరజీవి కాంస్య విగ్రహం**

**సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ**

**-అమరజీవి స్మృతి వనం పరిశీలించిన మంత్రి సవిత**



విజయవాడ, మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణ త్యాగ ఫలితం భావితరాలకు తెలియజేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. పొట్టి శ్రీరాముల 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరులో ఏర్పాటు చేస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న ఆయన విగ్రహ పనులను శనివారం మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరుతో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మృతి వనంలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమరజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తోందన్నారు.



అమరజీవి 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఎత్తైన ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయాలను, త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే స్మృతి వనం లక్ష్యమన్నారు. ఈ నెల 16న అమరజీవి 125వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహావిష్కరణను చేయబోతున్నామన్నారుఈ కార్యక్రమానికి ఆయనతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు తరలిరానున్నారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ చేసిన రోజును రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. వాసవీ మాత పేరుతో ఆమె జన్మించిన పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఆమె, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పొట్టి శ్రీరాముల విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడివాడ ఎమ్మెల్యే రాము సారథ్యం వహించిన జట్టుకు క్రికెట్, వాలీబాల్ లో ప్రధమ బహుమతులు



గుడివాడ, మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విజయవాడలోని ఆంధ్ర లూక్స్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఆయన ప్రాతినిధ్యం వహించిన క్రికెట్, వాలీబాల్ జట్లు ఫస్ట్ ప్రైజ్ సాధించగా, వ్యక్తిగత విభాగాల్లో చెస్‌లో ఫస్ట్ ప్రైజ్, టేబుల్ టెన్నిస్‌లో సెకండ్ ప్రైజ్ దక్కాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్ , మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ప్రజాసేవలో నిత్యం బిజీగా ఉండే ప్రజాప్రతినిధులకు ఇలాంటి కార్యక్రమాలు పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడమే కాకుండా, మరింత ఉత్సాహంతో ప్రజల కోసం పనిచేయడానికి ప్రేరణనిస్తాయని వెనిగండ్ల రాము తెలిపారు.

## మన భాషను మనమే పరిరక్షించుకోవాలి

**- భావితరాలకు ఆదర్శం కావాలి : సిడం అర్జు**



హైదరాబాద్, నేటి శుభోదయ ::: మన భాష ను మనమే పరిరక్షించుకోవాలని భావితరాల వారికి ఆదర్శం కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్రం రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ సిడం అర్జు పేర్కొన్నారు. పోలవరం జిల్లా చింతూరు మండలం లోని రామన్నపాలెం గ్రామంలో శనివారం పూనెం బాబురావు అధ్యక్షతన జరిగిన రజితోత్సవ కార్యక్రమంలో కోయత్తోర్ బాట బాల సాహిత్య సమన్వయ కర్త యాదయ్య పాల్గొని ప్రసంగిస్తూ కోయ భాషను భావితరాల వారికి అందించటానికి కోయత్తోర్ బాట గత 25 ఏళ్లుగా ఎంతో కృషి చేస్తుందని, ప్రశంసించారు. ఈ సందర్భంగా కోయ రచయితలు,దుమ్మిరి భీమమ్మ,తెల్లం కృష్ణ, బొక్కిలి నాగేశ్వరరావు రచించిన విజ్జ, అలింబిలం కోటై, గాలి గాలి కుక్కు, అనే మూడు పుస్తకాలను అతిథులందరూ ఆవిష్కరించారు. వార్త పత్రిక పూర్వ సంపాదకులు టంకశాల అశోక్ మాట్లాడుతూ కోయ భాష అంతరించిపోయే ప్రమాదంలో ఉంది కావున తమ భాష పరిరక్షణకు గిరిజన విద్యాధి కులందరు కృషి చేయాలని, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆంత్రపాలజీ ప్రొఫెసర్ శివప్రసాద్ మాట్లాడుతూ కోయత్తో ర్ బాట గత 25 ఏళ్లుగా డ్రాప్ అవుట్ విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచి ఉన్నత చదువులకు వెళ్లడానికి ఎంతగానో కృషి చేసిందని, వారి కృషి మరువలేనని కొనియాడారు. ఈ సందర్భంగా సమత స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రెబ్బ ప్రగడ రవి మాట్లాడుతూ 5 షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీలోని బాక్సైట్ లాంటి ఖనిజాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఎంతగానో ఉందని ఆ దిశగా ముందుకు వెళతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కోయ బాల సాహిత్యాన్నిఅన్ని గిరిజన ప్రాంతాలకు విస్తరించాలని కోరారు. కోయ రచయిత్రి కుంజా కళ్యాణి మాట్లాడుతూ తాను కోయ భాష లో కవిత్వం నేర్చుకోవడానికి కోయతో రు బాటకు వచ్చి నేర్చుకుంటానని, తద్వారా గిరిజనులకు భాష పెంపొందించేందుకు తోడ్పడుతానని పేర్కొన్నారు. ఎం.వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కోయత్తో ర్ బాట గత 25 సంవత్సరాలుగా చేసిన సేవలు మరువరానివని, డ్రాప్ అవుట్ విద్యార్థులకు ఎంతగానో సేవ చేసిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ వృద్ధాశ్రమం నిర్వాహకులు ఫాదర్ పీటర్ డానియల్ మాట్లాడుతూ తనకు కోయ త్తో ర్ బాటకు ఉన్న సంబంధ బాంధవ్యాలను గుర్తుకు తెచ్చుకొని చేసిన సేవలను కొనియాడారు. కోయత్తోర్ బాట పూర్వ అకడెమిక్ సమన్వయ కర్త డాక్టర్ పాండు మాట్లాడుతూ తాను 25 సంవత్సరాలుగా కోయతోర్ బాటకు ఉన్న అనుబంధాన్ని, విద్యార్థులకు నేర్పిన పాఠాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు పాడి వినిపించిన పాటలు బాల గేయాలు ఆహుతులను ఆకట్టు కున్నాయి . చింతూరు కోయ యువతీ యువకులు చేసిన రేల నృత్యం ను పలువురు వక్తలుప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పటేలు బ్రహ్మయ్య, అధ్యక్షులు వెంకటలక్ష్మి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## బస్టాండ్ సెంటర్లో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు

**-బూరగడ్డ శ్రీకాంత్**



గుడివాడ,మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) స్థానిక బస్టాండ్ సెంటర్ లో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు (ఉద్యమి)కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ జనసేన పార్టీ లో సభ్యత్వం తీసుకోవటం వలన జరుగు ప్రయోజనాల గురించి వివరించారు. సాధక్ లకు దిశా నిర్దేశం చేశారు.ఈ గుడివాడ జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస రావు, పట్టణ ఉపాధ్యక్షులు వేమూరి త్రినాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, సుంకర వెంకట్, షేక్ నాగూర్ భాషా, సీతారాం, శ్రీనివాస రావు, షరీఫ్, లోయ రాజా మరియు వీరమహిల కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## చిక్కవరం చెరువులో ముగ్గురు విద్యార్థుల మృతిపై విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి

**-కేవలం డబ్బు పిచ్చితో చేసిన అక్రమ తవ్వకాలే ఈ ముగ్గురు అమాయకుల ప్రాణాలు తీశాయని ఆరోపణ.**

**-నిబంధనలకు విరుద్ధంగా చెరువుల్లో తాడిచెట్టు లోతు వరకు తవ్వడం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందనీ వెల్లడి**

**- అక్రమ తవ్వకాల కారణంగా ఇప్పటివరకు 34 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత ఆవేదనకరం**

**-ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం కలెక్టర్, అధికారులతో మాట్లాడి బాధితులకు తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ**

**-ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తానని వెల్లడి**

**-చెరువులు ఊరి ఉమ్మడి ఆస్తులు గ్రామాల్లోని పెద్దలు తమ ఊరి చెరువులను అక్రమార్కుల నుంచి వారే కాపాడుకోవాలనీ పిలుపు**



గన్నవరం, మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) : చెరువులో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.గన్నవరం మండలం చిక్కవరం చెరువులో ప్రమాద వశాత్తూ పడి మృతి చెందిన 8వ తరగతి చదువుతున్న దుప్పుల వినయ్‌కుమార్ (14), 10వ తరగతి విద్యార్థి బిళ్ళ మోహన్ సాయి (15), మరియు ముచ్చ వెంకట జోసెఫ్ (15) ల కుటుంబాలను పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటన అత్యంత హృదయవిదారకమని, చెరువు ఎంట్రన్స్‌లోనే 12 అడుగుల లోతు ఉండటం, మరికొంత ముందుకు వెళ్తే తాడిచెట్టు లోతు ఉండటమే ఈ ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. గత తొమ్మిదేళ్లుగా చెరువులు ఊరి ఉమ్మడి ఆస్తులని, వాటిని అక్రమంగా తవ్వనివ్వద్దని తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదని, కేవలం డబ్బు పిచ్చితో చేసిన అక్రమ తవ్వకాలు కారణంగానే ఈ ముగ్గురు అమాయక విద్యార్థుల మరణించారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రమాదాల్లో చనిపోయిన వారికి తక్షణ సాయం అందించే విషయంలో ఉన్న ఇబ్బందులపై కలెక్టర్, ఎంఆర్ఓలతో మాట్లాడానని తెలిపారు. ఈ ఘటన పై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. చనిపోయిన విద్యార్థులు బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారని, వారిలో ఒక విద్యార్థి వెంకట జోసెఫ్ తల్లిదండ్రులకు కనీసం ఇంటి స్థలం కూడా లేదని వారికి ఇంటి స్థలం కేటాయించాలని తహసిల్దార్ కు సూచించారు. అలానే మరో విద్యార్థి బిల్లా మోహన్ సాయి తల్లి గతంలో జరిగిన ప్రమాదంలో చేయి కోల్పోయి అత్యంత దీనస్థితిలో ఉందని, కనీసం ఉండటానికి సరైన ఇల్లు కూడా లేని ఆ కుటుంబానికి పీఎంఏవై కింద రూ. 2.5 లక్షలు మంజూరు చేయించి, మిగిలిన మ్యాచింగ్ గ్రాంట్ తానే భరించి ఇల్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌లతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తానని స్పష్టం చేశారు. మానవ తప్పిదం వల్ల జరిగిన ప్రాణనష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో బ్రహ్మలింగయ్య చెరువు డీసిల్టింగ్ పేరుతో 16 కోట్లు కొల్లగొట్టి, నిబంధనలకు విరుద్ధంగా తాడిచెట్టు లోతు వరకు తవ్వేశారని విమర్శించారు.అక్రమంగా చెరువులు తవ్వటం వల్ల ఈ నియోజకవర్గం లో 34 మంది చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా మట్టి తవ్వే వారు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి చేరి ఇలాంటి పాపపు పనులకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజున కూడా, క్వారీ నుంచి మట్టి తవ్వి సభకు తరలించి మాజీ ఎమ్మెల్యే అనుచరులు 7 కోట్ల రూపాయల బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. అలాంటి వారి వల్ల అమాయకులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజల కోసం తాను పనిచేస్తానని, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తపై కూడా తప్పుడు కేసులు పెట్టనని స్పష్టం చేశారు. గ్రామాలలోని పెద్దలు తమ ఊరి చెరువులను అక్రమార్కుల నుంచి కాపాడుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చెరువులన్నింటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వంతో మాట్లాడతానని, అక్రమ గ్రావెల్ తవ్వకాలను కూడా అరికడతానని యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల తహశీల్దార్ కెవి శివయ్య, గన్నవరం సీఐ ప్రసాద్, రాష్ట్ర టిడిపి నాయకులు దొంతు చిన్నా, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, చిక్కవరం గ్రామ టిడిపి అధ్యక్షులు మణిమాల వెంకట అప్పారావు, చిట్టినేని జోజి, బోడపాటి రవి, జొన్నలగడ్డ సుధాకర్, యనమదల సతీష్, బండి భాస్కర్, అన్నే హరికృష్ణ, కోటగిరి రాజేంద్ర వరప్రసాద్, కొలుసు కనకసుబ్బారావు, పూర్ణ, సత్యనారాయణ, వీరబాబు, రమేష్, వీరస్వామి, జోజిబాబు, నువ్వుల సురేష్, నువ్వుల అనుమాలు, తిరువీధి నరేష్, మల్లారెడ్డి కిషోర్, పరుచూరి నరేష్, చల్లగుల్ల సందీప్, కంచర్ల సూర్య, నందిపాముల పృథ్వీ, చల్లగాలి సునీల్, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## కంపెనీలు ఇష్టారాజ్యంగా కోకో గింజలు ధరలు తగ్గించడం వలన నష్టపోతున్న కోకో రైతులు

**ధరల పాలసీ, ఫార్ములా, కోకో గింజలకు ధర నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి**

**రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే కోకో రైతులు సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలి**

**ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం పిలుపు**



ఏలూరు, నేటి శుభోదయ ::: కోకో గింజలకు ధరల పాలసీ ప్రకటించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కంపెనీలు ఇష్టారాజ్యంగా అంతర్జాతీయ మార్కెట్ ధరలు సాకు చూపి దేశీయంగా ధరలు తగ్గించి వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. కోకో గింజలకు ధరల పాలసీ, ఫార్ములా, ధర నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు పవర్ పేట లోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కోకో రైతుల సమస్యలపై పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఏడాది ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్ ధర కిలో కోకో గింజలకు రూ.900లకు పైగా ఉంటే రూ.450 మాత్రమే ధర ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ ధర తగ్గిందని కిలో గింజల ధరను రూ.400 నుండి రూ.300,రూ.350 లకు తగ్గించి వేయడం దుర్మార్గమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ధరల పాలసీ ప్రకటించకపోవడం వలన కంపెనీల ఇష్టారాజ్యంగా తయారయ్యిందన్నారు. పైగా రైతుల నుండి కోకో గింజలు కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మోండలీజ్ కంపెనీ కొద్ది మంది రైతులు దగ్గరే గింజలు కొనుగోలు చేస్తోందని, దాదాపు 80 శాతం మంది రైతులు వద్ద గింజలు కొనుగోలు చేయకపోవడం వలన వేల టన్నుల గింజలు రైతులు వద్ద నిల్వ ఉండిపోయిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.ఇప్పటికైనా ధరల పాలసీ ప్రకటించాలని కోరారు. కిలో కోకో గింజలకు రూ.500 ధర కల్పించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు.ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ళ వెంకట సుబ్బారావు, పానుగంటి అచ్యుతరామయ్య,ఉప్పల కాశీ మాట్లాడుతూ కోకో గింజలు ధరలు తగ్గించిన కంపెనీలు చాక్లెట్ ధరలు తగ్గించలేదన్నారు. కంపెనీలు లాభాలు దండుకుంటూ కోకో రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ఆయిల్ పామ్ గెలలు ధర మాదిరిగా ఫార్ములా రూపొందించి ధర నిర్ణయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఫార్ములా రూపొందించి ధర నిర్ణయించాలని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కోకో రైతులు రోడ్లెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రుద్రరాజు సుబ్బరాజు, కొండపల్లి సత్యనారాయణ, ఆర్.సుబ్బారావు,కె.సతీష్ బాబు, ఆలపాటి శ్రీనివాసరావు, ఎం.వి.రత్నాజీ, పి.పెదవీర్రాజు, ఏలూరు జిల్లాతో పాటు తూర్పుగోదావరి,పశ్చిమగోదావరి వివిధ జిల్లాల నుండి వచ్చిన కోకో రైతులు పాల్గొన్నారు.

## పామర్రు రావి హరి గోపాల్ నగర్ లో పోలీసుల కార్డెన్ సెర్చ్



పామర్రు, మార్చి 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పామర్రు హరి గోపాల్ నగర్ లో శనివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. 11 మంది ఎస్ఐలు150 మంది పోలీసుల బృందంతో తెల్లవారుజాము నుండి గోపాల్ నగర్ లో ఇల్లులు సోదాలు చేస్తు నివాసితుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. డీఎస్పీ ధర్మేంద్ర నేతృత్వంలో చేపట్టిన సెర్చ్ లో ధ్రువపత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు.కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఈగల్ ఎస్పీ మహేశ్వర రాజు ఆదేశాల మేరకు కార్డెన్ చర్చ్ చేపట్టినట్లు డిఎస్పీ ధర్మేంద్ర వెల్లడించారు.



## - ఏపీ ఈఏ కాన్ఫరెన్స్ కు హాజరైన కే యం డి సి అధ్యాపకురాలు



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మంలో గల స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సోషల్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.కె.ఆషా బేగం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం లో జరుగుతున్న ఎక్స్ ఎల్ ఐఐ ఆంధ్రప్రదేశ్ ఎకానమిక్ అసోసియేషన్ (ఏపిఈఏ ). కాన్ఫరెన్స్ కు హాజరై ఎంపవర్మెంట్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్ త్రూ డిజిటల్ లిటరసీ, కెపాబిలిటీ బిల్డింగ్స్ ఫర్ వికసిత్ భారత్ 2047' అనే అంశంపై రీసెర్చ్ పేపర్ ను ప్రజెంట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. కె. ఆషాబేగంను కళాశాల సెక్రటరీ కోట అప్పిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కె.వి. రమణారావు, వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు అభినందించారు.

## టిడిపి సీనియర్ నాయకులు వల్లభ శెట్టి సుబ్బారావు ఆకస్మిక మృతి.!

**శోకసంద్రంలో మునిగిన నిడిగట్ల గ్రామం**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వల్లభ శెట్టి సుబ్బారావు (56) అకస్మికంగా మృతి చెందారు. ఆయన ఇటీవల కాలంగా కొంత అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు స్థానికులు తెలియజేశారు. దీంతో గ్రామంలోనూ.. ఆయన కుటుంబంలోనూ విషాదఛాయలు అలముకున్నాయి. సుబ్బారావు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. దశాబ్దాల కాలం నుంచి గ్రామశీలో ఎనలేని సేవలు అందించారు. అలాగే కూటమి పార్టీల నాయకులతో కలిసి గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. సుబ్బారావు మృతి పట్ల నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం, జనసేన, బిజెపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు కార్యకర్తలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

## ఖమ్మం లో తెలంగాణ న్యూరో పదవ వార్షికోత్సవ కాన్ఫరెన్స్ ను ప్రారంభించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




ఖమ్మం, నేటి శుభోదయ ::: మమత మెడికల్ కాలేజ్ ఆడిటోరియం నందు ఖమ్మం లో తెలంగాణ న్యూరోసైన్సెస్ పదవ వార్షికోత్సవ కాన్ఫరెన్స్ ను మమత వైద్య సంస్థల చైర్మన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు.పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రమౌళి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. వారిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సత్కరించారు.న్యూరో విభాగం అనేది మనిషికి చాలా ముఖ్యమైన అవయవాలకు సంబందించిన విభాగం అని , మనిషి మెదడుకు, ఇతర అవయవాలకు సంబంధించిన చాలా అరుదైన శస్త్ర చికిత్సలు జరిగాయని కాలానికి అనుగుణంగా ఎన్నో రకాల వైద్య చికిత్సలు సరికొత్త టెక్నాలజీతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ న్యూరోసైన్సెస్ వార్షికోత్సవ కాన్ఫరెన్స్ మమత మెడికల్ కాలేజ్ జరగడం చాలా ఆనందాయకమని సూపర్ స్పెషాలిటీ సమావేశంలో 400పైగా డాక్టర్లు హాజరు అయినందుకు ఇది మంచి పరిణామం అని మమత కాలేజ్ నందు ఎన్నో సంబంధిత విభాగాల కాన్ఫరెన్సు జరిగాయని కార్యక్రమం నిర్వహించిన నిర్వహకులను అభినందించారు.కార్యక్రమంలో మమత సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ రాజ్,ప్రిన్సిపాల్ అనురాధ,డాక్టర్ జగదీష్,డాక్టర్ రాజిరెడ్డి,డాక్టర్ అసాధారణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**రాజకీయాల్లో మహిళలది కీలక పాత్ర - లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలందిస్తాం**

**- వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ కాపా చంద్రకళ**



ఖమ్మం, వైరా, నేటి శుభోదయ ::: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ కాపా చంద్రకళ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వైరా మండలంలోని విప్పలమడక గ్రామ పంచాయితీ కార్యాలయంలో మహిళా గ్రామ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేడా హేమీమా చక్రపాణి అధ్యక్షతన జరిగిన సభలో కాపా చంద్రకళ ప్రసంగించారు. మహిళలు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు. కుటుంబాన్ని చక్కబెట్టటంలో మహిళల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విప్పలమడక గ్రామ పంచాయితీ 15 రోజుల్లోపు ఫ్రీజర్ బాక్స్ ను వితరణగా ఇస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ గ్రామంలో తమ క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం చైర్ పర్సన్ కాపా చంద్రకళ, 20వ వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మిలకు గ్రామ సర్పంచ్ మేడా హేమీమా చక్రపాణి, ఉపసర్పంచ్ బూర్గు లూర్ధమ్మ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ముందుగా చైర్ పర్సన్ కు గ్రామ మహిళలు ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా గ్రామ పంచాయితీ కార్యాలయంలో కాపా చంద్రకళ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి, ఉపసర్పంచ్ బూర్గు లూర్ధమ్మ, లయన్స్ క్లబ్ జిల్లా విజన్ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు, న్యూ లిటిల్ ఫ్లవర్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, మాజీ సర్పంచులు పారుపల్లి కృష్ణారావు తుమ్మల జాను పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్లు వీరపనేని చెన్నకేశవరావు, కొలికొండ వీరభద్రరావు, గ్రామ కార్యదర్శి కాంపెల్లి ధనమ్మ, వార్డు సభ్యులు ముత్తమాల నాగజ్యోతి, పారుపల్లి నిఖిత, ముత్తమాల దేవానందం, గరిడేపల్లి శ్రీనివాసరావు, సత్తెనపల్లి మాధవి, ముత్తమాల వెంకటరత్నం, కాశిమాల సామేలు, తేళ్ళూరి వెంకటయ్య, బూర్గు నందిని, ఏఎన్ఎం వసంత రాణి తదితరులు పాల్గొన్నారు.

# విప్పలమడకను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతా

- గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా - మేడా శంకరయ్య - సుశీలమ్మ ట్రస్ట్ సేవలు భేష్ - విప్పలమడకలో రూ. 3.50 లక్షలతో సామాజిక కార్యక్రమాలు

- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



ఖమ్మం , వైరా, నేటి శుభోదయ ::: వైరా మండలంలోని విప్పలమడకను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతానని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. విప్పలమడక గ్రామాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. అందుకోసం ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. విప్పలమడక గ్రామంలోని గ్రామపంచాయితీ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మహిళా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేడా హేమిమా చక్రపాణి మాట్లాడుతూ విప్పలమడక గ్రామాన్ని ఎమ్మెల్యే దత్తత తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా గ్రామంలో సైడ్ డ్రైన్లు నిర్మించాలని , పొలాలకు వెళ్లే రహదారులను మెటల్ రోడ్లుగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేని కోరారు. వీటితో పాటు అనేక సమస్యలు పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దింతో స్పందించిన ఎమ్మెల్యే విప్పలమడక అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మేడా శంకరయ్య - సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ కార్యాలయానికి రూ. 65 వేలు విలువ చేసే రెయిన్ ప్రూఫ్ టెంట్, 100 కుర్చీలను ఎమ్మెల్యే చేతుల మీదగా అందజేశారు. మేడా శంకరయ్య - సుశీలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు రూ. 3.50 లక్షలతో గ్రామంలో సామాజిక సేవలు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ట్రస్ట్ సేవలు భేష్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, ఎంపీడీవో సక్రియ, తహసిల్దార్ సురేష్ బాబు, గ్రామ సర్పంచ్ మేడా హేమీమా చక్రపాణి, ఉప సర్పంచ్ బూర్గు లూర్ధమ్మ, మాజీ సర్పంచులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్ పాపయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ లు కొల్లికొండ వీరభద్రరావు, వీరపనేని చెన్నకేశవులు, గ్రామ కార్యదర్శి కాంపెల్లి ధనమ్మ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# - ఖమ్మం నగరంలోని నిజాంపేట్ ప్రాంతంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, నేటి శుభోదయ ::: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఖజూర్ పండును తినిపిస్తూ ఇఫ్తార్ విరమించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. మత సామరస్యాన్ని కాపాడుతూ అందరం కలిసి ముందుకు సాగితేనే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు.అల్లా దయ అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని,రాష్ట్ర ప్రజలు, ఖమ్మం ప్రజలు సుఖసంతోషాలతో,సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం అల్లా అనుగ్రహంతో మరింత శుభాలు, శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.అదే విధంగా కేసిఆర్ నాయకత్వంలోని బిఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలో రంజాన్ సందర్భంగా అందించిన రంజాన్ తోఫా కార్యక్రమాన్ని ఆయన గుర్తు చేశారు. నిరుపేద ముస్లింలకు ఆ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉండేదని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధంగా రంజాన్ తోఫాను అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకుంటే మంచిదని అభిప్రాయం వ్యక్తం చేశారు.అనంతరం ఖమ్మం నగరంలోని ఖిల్లా ప్రాంతంలో మహమ్మద్ నజీముద్దీన్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అక్కడి స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలిపుకున్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ ఖమ్మం నగర అధ్యక్షులు పగడాల నాగరాజు,కార్పొరేటర్ మక్బుల్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు తాజుద్దీన్,టౌన్ మైనారిటీ అధ్యక్షుడు షంసుద్దీన్,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి, నజీముద్దీన్, ముజాహిద్, పాషా, జవాద్, అజాంచోటు, తౌసిఫ్,షబ్బీర్,మున్నా, చంటి,అజీమ్, గురుమూర్తి,ఇజారుద్దీన్, మైనార్టీనాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 99 రోజుల్లో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

హౌసింగ్ బోర్డు పరిధిలోని 5వేల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి

తెలంగాణ హౌసింగ్ బోర్డు రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను

ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్, నేటి శుభోదయ ::: ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి పొంగులేటి శనివారం సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ఫ్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల గడువు ముగిసిపోయిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రి పొంగులేటి కి వివరించారు.దీనిపై మంత్రి పొంగులేటి స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. కేటాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ, ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు, అలాంటి మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రప్రహర్ లో భాగంగా మెగా కార్డాన్ సెర్చ్



చింతూరు డివిజన్ నేటి శుభోదయ:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ వజ్రా ప్రహార్ కార్డాన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా శనివారం చింతూరు డివిజన్ కేంద్రంలో మెగా కార్డాన్ సెర్చ్ కార్యక్రమం చింతూరు పోలీస్ సబ్ డివిజన్ పోలీస్ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చింతూరు ఎస్టీ కాలనీ,మెడికల్ కాలని ప్రాంతాల్లో విస్తృతంగా నిర్వహించారు.మాదక ద్రవ్యాల వినియోగం,అక్రమరవణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడం లక్ష్యం గా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ మెగా ఆపరేషన్ ను చింతూరు ఏ ఎస్పీ బొడ్డు హేమంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది ,ప్రత్యేక టీం,ఏంగిల్ టీం,లు కలిసి గుర్తించిన హాట్స్పాట్ ప్రాంతాల్లో అనుమానం ఉన్న ప్రాంతాల్లో అలాగే అద్దె ఇళ్లు,విద్యార్థుల వసతి గృహాలు,పిజి నివాసాలు, లాడ్జ్ లు,ఖాళీ భవనాలు,బస్ స్టేషన్ ఇతరత్ర అనుమానస్పద ప్రదేశాల్లో పోలీసులు సోదాలు చేశారు. ఈ ఆపరేషన్ లో మొత్తం 120 మంది వ్యక్తుల దగ్గర వేలు ముద్రలు డివైజ్ ద్వారా చెక్ చేసి పాత నేరాల గురించి తెలుసుకున్నారు.వారి వాహనాలు తనికి చేశారు.డ్రోన్ ద్వారా అనుమానస్పద ప్రదేశాల్లో ఏరియల్ సర్వే చేశారు.పత్రాలు సరిగా లేని 11 వాహనాలను గుర్తించారు.రౌడీ షీట్లు,సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పోలీస్ అధికారులు ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సామాజిక మరియు చట్ట పరమైన దుష్ప్రభావాలు గురించి అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని కుటుంబ వ్యవస్థ పై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.ప్రజలు ఎటువంటి గంజాయి మరియు మాదక ద్రవ్యాలు పై ఎటువంటి సమాచారం ఉన్న వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు ప్రజలతో కలిసి వజ్రా ప్రహార్ ప్రతిజ్ఞ నిర్వహించారు అలాగే సమాజాన్ని డ్రగ్స్ రహితముగా మార్చడంలో ప్రతి ఒక్కరి సహకారం ఎంతో ముఖ్యం అని తెలిపారు.ఈకార్యక్రమంలో భాగంగా మొత్తం 20 మంది పోలీస్ అధికారులు చింతూరు ఎస్సై రమేష్, యటపాక సి ఐ కన్నపరాజు సిబ్బంది పాల్గొన్నారు.



# చరిత్ర చెప్పని నిజం మీటర్నిటి బెనిఫిట్స్ ఎలా వచ్చాయో ఒకసారి చూద్దాం



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఏఐటీయూసీ పోరాటం వల్లనే మెటర్నిటీ బెనిఫిట్స్ వచ్చాయన్న విషయాన్ని మనం తెలుసుకోవాలి.దాగి ఉన్న చరిత్ర చెప్పని నిజాలను వెలికి తీసే ప్రయత్నంలో భాగంగా మదర్స్ డే సందర్భంగా సంఘటిత అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న తల్లులకు, శ్రామిక మహిళా సోదరీమణులకు అంకితం.మనం పొందుతున్న మెటర్నిటీ లీవ్ ఏ విధంగా వచ్చిందో తెలుసుకోవాల్సిన అవసరం ఇప్పుడు మనకు ఉంది. భారతదేశంలో మొదటిసారిగా మెటర్నిటీ బెనిఫిట్స్ 1929లో బాంబేలో కల్పించడం జరిగింది. దానికి ముందు ఏం జరిగిందో తెలుసుకుందాం. 1920 లో ఏఐటీయూసీ ఏర్పడిన తర్వాత ముంబైలోఎన్ ఎం జోషి , ఎస్ ఏ డాంగే ల ఆధ్వర్యంలో 1923లో బట్టల ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులతో గ్రేట్ అసోసియేషన్ ఆఫ్ మిల్ వర్కర్స్ అనే యూనియన్ స్థాపించి 1924 వరకు వాళ్ల పోరాటం చేశారు. గిర్నీ కాంగార్ యూనియన్ నూ స్థాపించి 1928లో పెద్ద ఎత్తున కార్మికుల సమస్యల గురించి పోరాటం చేశారు. ఆ సమ్మెలో 54 వేల మంది పాల్గొన్నట్లు దాగిన చరిత్ర . 30 అక్టోబర్ 1928 నుండి 19 జనవరి 1929 వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె జరిగింది. అప్పుడు బాంబే ప్రెసిడెన్సి అసెంబ్లీలో డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మెంబెర్ గా ఉన్నారు. ఎస్ ఏ డాంగే , ఎన్ ఎం జోషి, ముజఫర్ అహ్మద్, షౌఖత్ ఉస్మాని తదితరులు ఆ పోరాటానికి నాయకత్వం వహించారు. కార్మికుల సమస్యల గురించి 9 మంది సభ్యులతో ( నలుగురు కార్మిక నాయకులు, 5 మంది ప్రజా ప్రతినిధులు) లతో కూడిన బృందం చర్చలు జరిపింది. ఆ చర్చల్లో ఫ్యాక్టరీలలో కార్మికుల కనీస అవసరాల గురించి చర్చించడం జరిగింది. అంతకుముందే భారతదేశంలో ఫ్యాక్టరీస్ యాక్ట్ 1881 లో వచ్చింది. 1917 లో అక్టోబర్ విప్లవం విజయవంతం అవటంతో ఏర్పడిన సోవియట్ యూనియన్ లో ఫ్యాక్టరీలలో కల్పిస్తున్న కనీస సౌకర్యాల గురించి ఆ చర్చల్లో ప్రస్తావించడం జరిగింది. అందులో భాగంగానే సోవియట్ యూనియన్ లోని గర్భిణీ స్త్రీలకు ఇచ్చే మెటర్నిటీ లీవ్ గురించి ఎస్ ఏ డాంగే తెలియజేస్తూ ప్రసవానికి ముందు ఒక నెల రోజులు ప్రసవం తర్వాత 45 రోజులు పాటు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని ప్రతిపాదించడం జరిగింది. అప్పుడు ప్రభుత్వం ప్రసవానికి ముందు 15 రోజులు ప్రసవం తర్వాత 30 రోజులు మొత్తంగా 45 రోజులుగా నిర్ణయించి ఈ ప్రతిపాదనను ఆమోదింపజేసింది. ఏఐటీయూసీ పోరాటంతో భారత దేశంలో మొదటిసారిగా 1929 లో బాంబే ప్రెసిడెన్సీలో మెటర్నిటీ బెనిఫిట్స్ ని ఇవ్వటం జరిగింది. ఆ తర్వాత బంకిమ్ ముఖర్జీ నాయకత్వంలో కలకత్తా ప్రెసిడెన్సీలో జరిగిన పోరాటం వలన కలకత్తాలో 1930 వ సంవత్సరంలో, సింగారవేరి శెట్టియార్ నాయకత్వంలో జరిగిన పోరాటం వల్ల 1931 లో మద్రాస్ ప్రెసిడెన్సీలలో చట్టాలు చేయడం జరిగింది. మరలా ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే 1948 లో వచ్చిన ఈఎస్ఐ యాక్ట్ వల్ల 90 రోజులకు దాన్ని పెంచటం జరిగింది.ఇప్పుడు శ్రామిక మహిళా మాతృమూర్తులు అనుభవిస్తున్న మెటనిటీ బెనిఫిట్స్ ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే వచ్చిన విషయాన్ని కావాలని దాచిన దాగని నిజం. ఈ చరిత్ర ను మనమంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తాము. దాగి ఉన్న చరిత్రను వెలికి తీసే ప్రయత్నంలో ఈ చిన్న మెసేజ్ మీకోసం. ఉద్యమ అభినందనలతో తోట రామాంజనేయులు ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, సెల్.9492959090.

## ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా విస్సన్నపేటలో చలివేంద్రాల ఏర్పాటు

సర్పంచ్ నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతులు



విస్సన్నపేట : నేటి శుభోదయ (ప్రతినిధికమలాకర్) :విస్సన్నపేట మండల కేంద్రంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని బాటసారులకు ప్రజలకు దాహర్తి తీర్చే ఇద్దేశంతో ప్రజా ప్రతినిధులను అధికారులను కూడగలుపుకొని చలివేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగింది అందులో భాగంగా ముందుగా విస్సన్నపేట మండల కేంద్రమైన లక్ష్మీ టాకీస్ సెంటర్ నందు గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతుల చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించగా,సెయింట్ థెరీసా పాఠశాల సెంటర్ నందు,వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఎన్ వి కుటుంబరావు, బస్టాండ్ సెంటర్ నందు మండల వైసీపీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద స్థానిక ఎంపీపీ గద్దల మల్లయ్య, ఎంపీడీవో చిన్న రాట్నాలు ప్రారంభించటం జరిగింది వేసవి కాలం ప్రారంభంలోనే వాతావరణశీ వేడెక్కటంతో ముందస్తుగా ఈ విషాయాన్ని గ్రహించి పాదచారులకు వాహనదారులకు వివిధ వ్యాపకాల కొరకు విస్సన్నపేట వచ్చిపోయే ప్రజలు మంచి నీటికోసం ఇబ్బంది పడకూడదు అని గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు తీసుకున్న నిర్ణయం హర్షనీయం అని ప్రజలు ప్రస్థావించుకొనుచున్నారు.ఈ బృహత్తర కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు,ఉప సర్పంచ్ మందపాటి సత్యనారాయణ రెడ్డి,ఈవో హరికృష్ణ కుమార్,వైసీపీ జిల్లా నాయకులు లాయర్ శిరసాని ప్రకాష్,ఏ లాలయ్య,మాజీ సర్పంచ్ పి లక్ష్మయ్య,కోట శ్రీను,వార్డు మెంబర్ పిల్లి రాజేష్,శివాలయం వీధి వైసిపి నాయకులు రామవరపు దుర్గ,కోట లక్ష్మణ,రెడ్డి ముత్యాలు,ఏ హరి, నటరాజ్,చందా,చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం




చింతూరు డివిజన్ నేటి శుభోదయ:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్. కె రత్న మాణిక్యం మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు బాలికల విజయాలకు గుర్తింపుగా ప్రతి కార్యాలయంలో, విద్యాసంస్థల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం మొత్తం పురోగమించి 2047 నాటికి వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐటీడీఏ ఎ.పి.ఒ శ్రీమతి సి.హెచ్ రామతులసి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధికి ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, ఆడపిల్లలకు పరిమితులు విధించకుండా వారి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే సమాజ అభివృద్ధికి తోడ్పడతారన్నారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ మహిళలు విద్య,వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారన్నారు. సీనియర్ అధ్యాపకులు జి. వెంకటరావు మాట్లాడుతూ “ఒక మహిళ చదివితే ఒక కుటుంబం చదివినట్టే“ అనే మాట అక్షర సత్యంమని, మహిళలకు విద్య,గౌరవం, అవకాశాలు కల్పిస్తే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా సాధికారత విభాగాధిపతి కె.శైలజ మాట్లాడుతూ మహిళల గౌరవానికి భంగం కలిగించకుండా వారికి సరైన అవకాశాలను అందించి ప్రోత్సహించాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.శకుంతల, జి హారతి, ఎస్ అప్పనమ్మ, ఎమ్. నాగమోహన్, జి.సాయికుమార్, ఎన్. ఆనంద్,బి. శ్రీనివాసరావు,కె ఎల్ ప్రసన్న కుమారి,కె.కీర్తి, ఆర్. కిరణ్మయి,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




## మన భాషను మనమే పరిరక్షించుకోవాలి ,భావితరాలకు ఆదర్శం కావాలి సిడం అర్జు



చింతూరు డివిజన్ నేటి శుభోదయ: మన భాష ను మనమే పరిరక్షించుకోవాలని భావితరాల వారికి ఆదర్శం కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్రం రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ సిడం. అర్జు పేర్కొన్నారు. పోలవరం జిల్లా చింతూరు మండలం లోని రామన్నపాలెం గ్రామంలో శనివారంపూనెం బాబురావు అధ్యక్షతన జరిగిన రజితోత్సవ కార్యక్రమంలో కోయత్తోర్ బాట బాల సాహిత్య సమన్వయ కర్త యాదయ్య పాల్గొని ప్రసంగిస్తూ . కోయ భాషను భావితరాల వారికి అందించటానికి కోయత్తోర్ బాట గత 25 ఏళ్లుగా ఎంతో కృషి చేస్తుందని, ప్రశంసించారు. ఈ సందర్భంగా కోయ రచయితలు,దుమ్మిరి భీమమ్మ,తెల్లం కృష్ణ, బొక్కిలి నాగేశ్వరరావు రచించిన విజ్జ, అలింబిలం కోట్రై, గాలి గాలి కుక్కు, అనే మూడు పుస్తకాలను అతిథులందరూ ఆవిష్కరించారు. వార్త పత్రిక పూర్వ సంపాదకులు టంకశాల అశోక్ మాట్లాడుతూ కోయ భాష అంతరించిపోయే ప్రమాదంలో ఉంది కావున తమ భాష పరిరక్షణకు గిరిజన విద్యాధి కులందరు కృషి చేయాలని, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆంత్రపాలజీ ప్రొఫెసర్ శివప్రసాద్ మాట్లాడుతూ కోయత్తో ర్ బాట గత 25 ఏళ్లుగా డ్రాప్ అవుట్ విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచి ఉన్నత చదువులకు వెళ్లడానికి ఎంతగానో కృషి చేసిందని, వారి కృషి మరువలేనని కొనియాడారు. ఈ సందర్భంగా సమత స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రెబ్బ ప్రగడ రవి మాట్లాడుతూ 5 షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీలోని బాక్సైట్ లాంటి ఖనిజాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఎంతగానో ఉందని ఆ దిశగా ముందుకు వెళతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కోయ బాల సాహిత్యాన్నిఅన్ని గిరిజన ప్రాంతాలకు విస్తరించాలని కోరారు. కోయ రచయిత్రి కుంజా కళ్యాణి మాట్లాడుతూ తాను కోయ భాష లో కవిత్వం నేర్చుకోవడానికి కోయతో రు బాటకు వచ్చి నేర్చుకుంటానని, తద్వారా గిరిజనులకు భాష పెంపొందించేందుకు తోడ్పడుతానని పేర్కొన్నారు. ఎం.వి ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కోయత్తో ర్ బాట గత 25 సంవత్సరాలుగా చేసిన సేవలు మరువరానివని, డ్రాప్ అవుట్ విద్యార్థులకు ఎంతగానో సేవ చేసిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ వృద్ధాశ్రమం నిర్వాహకులు ఫాదర్ పీటర్ డానియల్ మాట్లాడుతూ తనకు కోయ త్తో ర్ బాటకు ఉన్న సంబంధ బాంధవ్యాలను గుర్తుకు తెచ్చుకొని చేసిన సేవలను కొనియాడారు. కోయత్తోర్ బాట పూర్వ అకడెమిక్ సమన్వయ కర్త డాక్టర్ పాండు మాట్లాడుతూ తాను 25 సంవత్సరాలుగా కోయతోర్ బాటకు ఉన్న అనుబంధాన్ని, విద్యార్థులకు నేర్పిన పాఠాలను గుర్తు చేశారు.లి ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు పాడి వినిపించిన పాటలు బాల గేయాలు ఆహుతులను ఆకట్టు కున్నాయి . చింతూరు కోయ యువతీ యువకులు చేసిన రేల నృత్యం ను పలువురు వక్తలుప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పటేలు బ్రహ్మయ్య, అధ్యక్షులు వెంకటలక్ష్మి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# ఇద్దరు పోక నలుగురు రాక

కల్లూరు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ముగ్గురు కానిస్టేబుల్స్ బదిలీ



పులిచెర్ల, మార్చి 7,(నేటి శుభోదయ) :చిత్తూరు జిల్లా లో వివిధ పోలీస్ స్టేషన్ లలో పని చేస్తున్న 26 మంది ఏఎస్ఐ లను.. 62 మంది.కానిస్టేబుల్స్.ను. బదిలీ చేస్తూ జిల్లా ఎస్ పి.తుషార్ దూది. ఉత్తర్వులు జారీ చేశారు..ఇందులో భాగం గా కల్లూరు పోలీస్ స్టేషన్ లో మహిళా ఏఎస్ఐ. మహిళా కానిస్టేబుల్ లు బదిలీ కాగా... నలగరు కానిస్టేబుల్ లు కొత్తగా వస్తున్నారు. మహిళా కానిస్టేబుల్.. ఏ. శాంతి చిత్తూరు వన్ టౌన్ అర్బన్, పి. జె. సెల్వి అటాచ్డ్ టు చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్లకు లకు బదిలీ కాగా వి ఆర్ నుండి ఏ ఎస్ ఐ టీ.సత్యనారాయణ, విజయపురం పిఎస్ నుండి కానిస్టేబుల్ జి. విశ్వనాథం, పెనుమూరు పిఎస్ నుండి కానిస్టేబుల్ వి. నాగరాజు , వెదురుకుప్పం పిఎస్ నుండి కానిస్టేబుల్ సి. బాలచంద్రయ్య ల ను కల్లూరు పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు

నేటి శుభోదయ

సంపాదకీయం

# మౌనంగానే మెడలు వంచి!

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం వెనక...

## ఫలించిన మోదీ వేచి చూసే ఎత్తుగడ

## ఇతర దేశాలతో వరుసగా ఒప్పందాలు

## దాంతో ట్రంప్‌పై పెరిగిన ఒత్తిడి

## ఈయూ-భారత్ ఒప్పందంతో బెంబేలు

## దిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు

అసలే అతను డొనాల్డ్ ట్రంప్. శత్రువులా, మిత్రులా అన్న తేడా కూడా లేకుండా అన్ని దేశాలనూ హడలెత్తిస్తూ వస్తున్న వ్యక్తి! కఠిన పదజాలంతో కూడిన బెదిరింపులతో, ఎడాపెడా టారిఫ్‌ల బాదుడుతో వణుకు పుట్టించడాన్నే తన నైజంగా మార్చుకున్నారు. రెండోసారి అధికారం చేపట్టింది మొదలు, ఈ ఏడాది కాలంలో ప్రపంచ దేశాలకు ఒకరకంగా పీడకలలా పరిణమించారు. చివరికి దక్షిణ కొరియా, బ్రిటన్ వంటి అతి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ట్రంప్ బెదిరింపులకు జడిసి ఆయన డిమాండ్లకు అనుగుణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ విషయంలో మాత్రం ట్రంప్ హఠాత్తుగా దిగొచ్చిన తీరు ప్రపంచ దేశాలను విస్మయానికి గురి చేస్తోంది. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ఏకంగా 18 శాతానికి తగ్గిస్తున్నట్టు సోమవారం ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దీన్ని భారత్ సాధించిన ఘన విజయంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో తొలినుంచీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గకుండా, మాటల యుద్ధానికి బదులివ్వకుండా సంయమనం పాటిస్తూనే చివరికి మౌనంగానే ఆయన మెడలు వంచారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమ వుతోంది. బెదిరింపులనే తిరుగులేని ఆయుధంగా చేసుకుంటూ గత ఏడాది కాలంలో ట్రంప్ చెలరేగి పోయారు. దేశాధినేతలంతా తాను చెప్పినట్టు వినాలన్న ఒంటెత్తు పోకడ ప్రదర్శించారు. చివరికి నోబెల్ శాంతి పురస్కారానికి తాను అర్హుడినంటూ ప్రకటనలు చేయాల్సిందిగా వారిని ఒత్తిడి చేసే స్థాయికీ వెళ్లారు! పాక్ లాంటి పలు దేశాల అధినేతలు అందుకు తలొగ్గారు కూడా. కానీ మోదీ నుంచి మాత్రం మౌనమే సమాధానమైంది. దాంతో ట్రంప్ ఇగో దెబ్బ తిన్నది కూడా. మోదీ వ్యక్తిగతంగా ఫోన్ చేయనందుకే భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ బాహాటంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. ప్రధాని మాత్రం వీటిని పట్టించుకోలేదు. అంతేగాక ట్రంప్ బెదిరింపుల ఉచ్చులో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఒప్పందం విషయమై ట్రంప్ నాలుగుసార్లు స్వయంగా ఫోన్ కాల్స్ చేసినా పట్టించుకోలేదు. ఆయన కారాలు, మిరియాలు నూరుతున్నా లక్ష్యపెట్టకుండా బ్రిటన్, న్యూజిలాండ్, అనంతరం ఒమన్‌లతో లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తద్వారా స్వతహాగా వ్యాపారి అయిన ట్రంప్‌నే మించిపోయే స్థాయిలో మోదీ వ్యాపార దక్షత ప్రదర్శించారు. ఈ చర్యతో ఆయనను పునరాలోచనలో పడేశారు. ఇక గత నెలలో యూరోపియన్ యూనియన్‌తో అతి కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్ ఖరారు చేసుకుంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత భారీదని కొనియాడుతున్న ఈ డీల్ భారత్‌పై దూకుడు విషయంలో ట్రంప్‌కు గట్టిగా బ్రేకులు వేసిందని చెబుతున్నారు. 27 దేశాల కూటమి అయిన ఈయూతో కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయ వేదికపై భారత స్థాయిని మరింత పెంచింది. ట్రంప్ చపలచిత్తం పుణ్యమా అని ఇతర దేశాల దృష్టిలో అమెరికా శరవేగంగా విశ్వసనీయతను కోల్పోతూ వస్తోంది. అందుకు విరుద్ధంగా భారత్ మాత్రం అత్యంత నమ్మదగ్గ భాగస్వామ్య దేశంగా తన ప్రతిష్టను పెంచుకుంటూ వచ్చింది. పైగా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌ను ఏ దేశమూ ఇప్పుడు తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఇందుకు అమెరికా కూడా మినహాయింపు కాదు. అందుకే వ్యవసాయ, పాడి తదితర కీలక రంగాలను అమెరికా పరిశ్రమలకు బాహాటంగా తెరిచేందుకు కరాఖండిగా నిరాకరించి కూడా ఒప్పందానికి ట్రంప్‌ను భారత్ ఒప్పించగలిగింది! అదే సమయంలో ట్రంప్ ఎంతగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ప్రతి వ్యాఖ్యలకు దిగకుండా మోదీ పరిణతి ప్రదర్శించారు.

చైనాతో స్నేహ గీతం

ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా వ్యూహాత్మకంగా చైనాకు దగ్గరయ్యేందుకు కూడా భారత్ వెనకాడలేదు. గతేడాది షాంఘై సహకార సమాఖ్య భేటీకి హాజరయ్యేందుకు ఏడేళ్ల అనంతరం మోదీ చైనాలో పర్యటించారు! ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. అవి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. చివరికి ట్రంప్ కూడా వాటిపై చిర్రుబుర్రులాడారు. భారత్, రష్యాలను అమెరికా చివరికి చైనాకు కోల్పోయిందంటూ నిట్టూర్చారు! ఆ తర్వాత రెండు నెలలకే పుతిన్‌కు ఢిల్లీలో మోదీ రాచమర్యాదలు చేశారు. రష్యాతో పలు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. ఇలా పలు అగ్ర రాజ్యాలతో భారత్ వ్యూహాత్మకంగా ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకుంటున్న వైనం కూడా ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది. భారత్ అక్కడితోనే ఆగలేదు. ట్రంప్ టారిఫ్‌లకు ప్రతీకా రంగా తాను కూడా అమెరికాపై సుంకాలు బాదింది! అమెరికా నుంచి దిగుమతయ్యే పప్పులు, తృణధాన్యాలపై ఏకంగా 30 శాతం టారిఫ్‌లు విధించింది. ట్రంప్‌లా గొంతెత్తి ప్రకటనలు చేయకుండా మౌనంగానే గత నవంబర్ నుంచే వాటిని వసూలు చేయడం కూడా ప్రారంభించింది.

'ఒప్పందం'పై మోదీ మౌనం

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయిందని ట్రంప్ ప్రకటించినా, దానిపై మోదీ మాత్రం సూటిగా స్పందించకపోవడం విశేషం. అంతేగాక రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ ఒప్పుకుందని, అమెరికా నుంచి దిగుమతులను ఏకంగా 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లనుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మోదీ మౌనమే వహించారు. కేవలం టారిఫ్‌ల తగ్గింపుకు హర్షం వ్యక్తం చేయడానికే తన స్పందనను పరిమితం చేయడం గమనార్హం.

'గోర్' ఫ్యాక్టర్

సెర్గియో గోర్. భారత్‌లో అమెరికా నూతన రాయబారి. భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు వెనక ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. ఇరు దేశాల సంబంధాలు కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా దిగజారిన తరుణంలో గత జనవరి 12న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఎన్నడూ లేనంత బలోపేతం చేయడమే ఆ సందర్భంగా స్పష్టంగా ప్రకటించారు. 'నిజమైన మిత్రులు తొలుత విభేదించవచ్చు. కానీ అంతిమంగా ఒక్కతాటిపైకే వస్తారు' అని చెప్పుకొచ్చారు. అమెరికాకు భారత్ కంటే ముఖ్యమైన దేశం మరేదీ లేదని కూడా స్పష్టం చేశారు. ఖనిజాల అన్వేషణ, ఏఐ టెక్నాలజీ వాడకానికి సంబంధించి అమెరికా ఏర్పాటు చేసిన 'పాక్స్ సిలికా' కూటమిలో చేరాల్సిందిగా భారత్‌ను ఆహ్వానించారు కూడా. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సుదీర్ఘ ప్రతిష్టంభన కాస్తా ఆయన వచ్చిన మూడు వారాల్లోపే వీడిపోవడం విశేషం. ట్రంప్‌కు అత్యంత సన్నిహితునిగా గోర్‌కు పేరుంది. ఏ సందర్భంలోనైనా గోర్‌ను తాను పూర్తిగా విశ్వసిస్తానని ట్రంప్ చెబుతుంటారు. భారత్‌తో ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు విషయంలో ట్రంప్‌పై ఆయన ప్రభావం చాలా ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మాకు సమాచారం లేదు: రష్యా


మాస్కో: చమురు కొనుగోళ్ల నిలిపి వేతపై భారత్ నుంచి ఇప్పటి దాకా అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదని రష్యా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. ఇకపై వెనెజువెలా నుంచే భారత్ అధికంగా చమురు కొనుగోలు చేస్తుందని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ట్రంప్ వ్యాఖ్య లను నిశితంగా పరిశీలి స్తున్నట్టు రష్యా ఇంధన రంగ వ్యవహారాలు చూసే ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ చెప్పారు. భారత రిఫైనరీల నుంచి ఒప్పందాల రద్దు దిశగా ఎలాంటి నోటీసులూ అందలేదని రష్యా ఇంధన శాఖ వర్గాలు కూడా స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ భారీగా పెంచుకోవడం తెలిసిందే. ఆ దేశం నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశంగా కూడా నిలిచింది. దీనిపై అమెరికాతో పాటు యూరప్ దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయని సంగతి తెలిసిందే.

# అంతరిక్ష సంక్షేమం కోసం స్టార్‌గేజ్

**ఉపగ్రహాలు ఢీకొట్టకుండా అప్రమత్తం చేయనున్న వ్యవస్థ**

**వేల ఉపగ్రహాల తాజా లొకేషన్ ఉచితంగా షేరింగ్**

**కొత్తగా అందుబాటులోకి తెచ్చిన స్పేస్‌ఎక్స్**



ఇతరుల బాగు కోరే వారే మంచి మనిషి అని శతాబ్దాలుగా వింటున్నాం. ఇప్పుడీ మంచి పనిని అంతరిక్ష వేదిగా ఆచరించి చూపుతా మని ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన 'స్పేస్‌ఎక్స్' సంస్థ శనివారం ప్రకటించింది. అంతరిక్షంలో వందల కిలోమీటర్ల ఎత్తులో వేర్వేరు కక్ష్యల్లో తిరిగే కృత్రిమ ఉపగ్రహాలు హఠాత్తుగా స్థానచలనం చెందిన విపత్కర సందర్భాల్లో సమీప ఉపగ్రహాల ఆపరేటర్లను అప్రమత్తంచేసే అత్యాధునిక ఆన్‌లైన్ టూల్ 'స్టార్‌గేజ్'ను అందుబాటులోకి తెచ్చినట్లుస్పేస్‌ఎక్స్ ప్రకటించింది. దీనిని స్పేస్ సిట్యూవేషనల్ అవేర్‌నెస్ సిస్టమ్ అని కూడా పిలుస్తున్నారు.

### ఏమిటీ స్టార్‌గేజ్?

ఇదొక అప్రమత్త వ్యవస్థ. ఉపగ్రహాల ఇంధనం ఖాళీ అవడం, లేదా ఉపగ్రహం విఫలమై దిగువ కక్ష్యలోకి జారిపోవడం లేదా స్వేచ్ఛగా ఇష్టమొచ్చినట్లు తిరిగే సందర్భాల్లో అవి అంతరిక్ష బాంబుల్లా మారిపోతాయి. సమీప ఉపగ్రహాలకు ఢీకొట్టి సర్వనాశనం చేస్తాయి. తర్వాత ఇది శృంఖల చర్యలా విశృంఖలంగా జరిగి వందల ఉపగ్రహాలు ధ్వంసమయ్యే పెను ప్రమాదముంది. ఈ అంతరిక్ష ప్రమాదాన్ని మొగ్గదశలోనే తుంచేసే శక్తి ఈ స్టార్‌గేజ్‌కు ఉంది. అస్తవ్యస్తంగా కదులుతున్న ఉపగ్రహాల జాడ, లొకేషన్‌ను ఇతర ఆపరేటర్లకు ఉచితంగా స్పేస్‌ఎక్స్ అందిస్తుంది. దాంతో తమ ఉపగ్రహాలను ఆ ప్రమాదకర ఉపగ్రహం నుంచి దూరంగా తీసుకెళ్లడమో, దిగువ కక్ష్యలోకి సురక్షితంగా మార్చడమో సాధ్యమవుతుంది. దీంతో ఉపగ్రహాల యాక్సిడెంట్‌ను నివారించవచ్చు. కేవలం ఉపగ్రహాలు మాత్రమేకాకుండా హఠాత్తుగా దూసుకొచ్చిన చిన్నపాటి గ్రహశకలాల లొకేషన్‌నూ ఆపరేటర్లకు స్టార్‌గేజ్ అందిస్తుంది. అత్యంత ఖచ్చితత్వంతో కూడిన సమాచారం ఇవ్వడం స్టార్‌గేజ్ ప్రత్యేకత. అత్యాధుని సెన్సార్లు, సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్ సాయంతో పాత ఉపగ్రహాల శకలాలనూ స్టార్‌గేజ్ గుర్తించి వాటి జాడను ఆపరేటర్లకు అందజేస్తుంది. ఒకచోట పోగుబడిన శకలాల ప్రాంతాలను గుర్తించి అప్రమత్తంచేస్తుంది. ఉపగ్రహాలు ఢీకొట్టే అవకాశాలు గణనీయంగా తగ్గించి తద్వారా అంతరిక్ష చెత్త పోగుబడకుండా, ఆ ప్రాంతంలో మరో కొత్త ఉపగ్రహం వచ్చి చేరేందుకు మార్గం సుగమం చేస్తుంది. పౌర, సౌనిక, నిఘా, వాతావరణ ఉపగ్రహాల ప్రయోగాలతో దిగువ భూకక్ష్యల్లో కొత్త ఉపగ్రహాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. దీనికితోడు వేలాది ఉపగ్రహాల కూటమి స్టార్‌లింక్‌తో ఉపగ్రహాల సంఖ్య వేలాదిగా ఎక్కువైంది. ఈ తరుణంలో అంతరిక్షం సైతం ఒక రద్దీ అయిన రహదారిలో మారింది. రోడ్డుపై వాహనాలను క్రమబద్ధీకరించే ట్రాఫిక్ కానిస్టేబుల్ తరహా వ్యవస్థ తక్షణావసరమైంది. ఈ అవసరాన్ని స్టార్‌గేజ్ తీర్చనుంది.

### అదనంగా కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్..

ఇప్పుడున్న ఉపగ్రహాలు కొన్ని గంటల తర్వాత ఏ దిశగా ఎంత దూరం కదులుతాయి అనే వివరాలను స్టార్‌గేజ్ ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ ఉపగ్రహాల ఆపరేటర్లకు ఉచితంగా అందివ్వనుంది. దీంతో తోటి ఉపగ్రహాలతోపాటు ఖగోళ వస్తువులు, స్పేస్ చెత్త ఎక్కడున్నాయో ఇట్టే తెల్సిపోతుంది. వీటికి అనుగు ణంగా ఆపరేటర్లు తమ భవిష్యత్ ఉ పగ్రహాల ప్రయోగాల తేదీలను సవరించుకోవ చ్చు. దీని వల్ల అత్యంత విలువైన సమయం, ప్రయోగాల ఖర్చు కలిసివస్తాయి. స్టార్‌గేజ్ అందించనున్న అత్యంత విలువైన డేటా షేరింగ్ సమాచారాన్ని నాసా, ఇతర అంతర్జాతీయ ఉపగ్రహ ఆపరేటర్లు ఎప్పట్నుంచో కోరుతుండగా ఇన్నేళ్లకు ఇది సాకారమైంది. గత ఏడాది డిసెంబర్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ కూటమికి అత్యంత సమీపంగా చైనా ఉపగ్రహం దూసుకొచ్చింది. అవి ఢీకొట్టే పెనువినాశనం సంభవించేది. దీంతో భయపడిన స్టార్‌లింక్ ఏకంగా తమ 4,400 ఉపగ్రహాలను వెనువెంటనే 480 కిలోమీటర్ల దిగువ కక్ష్యలోకి తీసుకురావాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దనే సదుద్దేశంతో ఉచితంగా ఈ సేవలను స్టార్‌లింక్ అంతర్జాతీయంగా అన్ని దేశాలకు అందుబాటులోకి తెచ్చింది. కంజంక్షన్ డేటా మెసేజెస్(సీడీఎం)లను ఎప్పటికప్పుడు స్టార్‌గేజ్ పంపనుంది. కంజంక్షన్ స్క్రీనింగ్ సర్వీస్ ద్వారా గంటల తర్వాత రావాల్సిన డేటాను కేవలం నిమిషాల్లోనే సీడీఎంల రూపంలో ఆపరేటర్లు పొందొచ్చు.

# ఇండియా టీచింగ్..వరల్డ్ లెర్నింగ్

**దేశీ ఎడ్‌టెక్ ఎక్స్‌పోర్ట్ స్టోరీ స్టార్ట్**

**థాయ్, వియత్నాం టార్గెట్**

**బెంగళూరు నుంచి బ్యాంకాక్ వరకు ఎడ్‌టెక్ దూకుడు**

**యూఏఈ నుంచి ఇండోనేసియా వరకు మన కంపెనీల హవా**

**క్యూలో అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్**

**అంతర్జాతీయ మార్కెట్ల నుంచి 25 శాతం వరకు ఆదాయం**



దేశీ ఎడ్‌టెక్ కంపెనీలు అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునే క్రమంలో విదేశాల బాట పడుతున్నాయి. పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలకు విద్యా వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తున్నాయి. అప్‌గ్రాడ్, సింప్లీలెర్న్, బ్రైట్‌చాన్స్ మొదలైనవి ఈ లిస్టులో ఉన్నాయి. మన ఎడ్‌టెక్ కంపెనీలు ప్రధానంగా ఆగ్నేయాసియా, దక్షిణాసియాపై దృష్టి పెడుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వియత్నాం, థాయ్‌ల్యాండ్, ఇండొనేసియా, ఫిలిప్పీన్స్‌లాంటి మార్కెట్లలో విస్తరిస్తున్నాయి. ఆయా మార్కెట్లలో వినియోగదారుల ప్రొఫైల్ దాదాపు మన దేశం తరహాలోనే ఉండటం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

థాయ్, వియత్నాంలో అప్‌గ్రాడ్: టీమ్‌లీజ్ గణాంకాల ప్రకారం ఆగ్నేయాసియా, ఆఫ్రికా తదితర మార్కెట్లలో 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు 2 కోట్ల మంది పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా ప్రాంతాలపై మన సంస్థలు దృష్టి పెడుతున్నాయి. బెంగళూరుకు చెందిన అప్‌గ్రాడ్ సంస్థ థాయ్‌ల్యాండ్, వియత్నాంలో కార్యకలాపాలు విస్తరించింది. అలాగే యూఏఈ, మేనా ప్రాంతంలో (మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా) వర్క్‌ఫోర్స్ శిక్షణకు సంబంధించి వివిధ సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే సింప్లీలెర్న్ కంపెనీ వివిధ సంస్థలు, ప్రభుత్వాల భాగస్వామ్యాలతో అమెరికా, బ్రిటన్, పశ్చిమాసియావ్యాప్తంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇక కిడ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం అయిన బ్రైట్‌ఛాంప్స్ సంస్థ ఏకంగా 30 పైగా దేశాల్లో విస్తరించింది. యూఏఈ, సౌదీ అరేబియా, వియత్నాం మొదలైనవి వీటిలో ఉన్నాయి.

ఆకర్షణీయంగా ఆగ్నేయాసియా: వియత్నాం, థాయ్‌ల్యాండ్ లాంటి ఆగ్నేయాసియా దేశాలు వేగంగా డిజిటల్ ఎకానమీలుగా వృద్ధి చెందుతున్నాయి. దీంతో కెరియర్ పురోగతికి సంబంధించిన కోర్సులను నేర్చుకోవడంపై పెరుగుతున్న ఆసక్తిని అవకాశంగా మల్చుకోవడంపై ఎడ్‌టెక్ కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. 2024--25లో అప్‌గ్రాడ్ ఆదాయంలో అంతర్జాతీయ మార్కెట్ల వాటా 20--25 శాతంగా నమోదైంది. అటు సింప్లీలెర్న్ అంతర్జాతీయ యూజర్లలో 11 శాతం మంది బ్రిటన్, పశ్చిమాసియాలో ఉన్నారు. ఇక తమ గ్లోబల్ యూజర్లలో 30 శాతం మంది ఆగ్నేయాసియా, దక్షిణాసియా వారు ఉన్నారని బ్రైట్‌ఛాంప్స్ పేర్కొంది.

అంతర్జాతీయంగా పోటీ: మన కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా ఎదుగుతున్నప్పటికీ అంతర్జాతీయ దిగ్గజాల నుంచి పోటీ ఎదుర్కొనాల్సి వస్తోంది. యుడెమి, ఎరుడైటస్, యుడాసిటీ, కోర్సెరాలాంటి గ్లోబల్ సంస్థలు కూడా ఈ ప్రాంతాల్లో దూకుడుగా విస్తరిస్తున్నాయి. తమకు విదేశీ మార్కెట్లలో కోర్సెరా, ఎరుడైటస్ నుంచి పోటీ ఉంటోందని అప్‌గ్రేడ్ వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో ఎమెరిటస్, కోర్సెరా, యుడాసిటీలను సింప్లీలెర్న్ ఢీకొంటోంది. మిగతా సంస్థలతో పోలిస్తే తక్కువ వ్యయాలతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా, నాణ్యమైన శిక్షణ అందించడం ద్వారా దేశీ కంపెనీలు.. ఆయా మార్కెట్లలో పటిష్టపడేందుకు ప్రయతీ?నస్తున్నాయి. లీడ్ గ్రూప్ ఈ ఏడాది 1,200 పాఠశాలలతో భాగస్వామ్యాలను లక్ష్యంగా పెట్టుకుంది.

# 'సేవా' కుటుంబం

**పిల్లలతో కలిసి సేవా కార్యక్రమాలు**


**కుటుంబ బంధాలకు సూపర్ పవర్**

**పేరెంటింగ్‌తో పాటు వాలంటీరింగ్**

**బాలల వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది**

**సామాజిక సేవకూ ఇదే ఆరంభం**

**వెల్లడిస్తున్న తాజా అధ్యయనాలు**



కుటుంబం అంతా కలిసి పాల్గొనే సేవా కార్యక్రమాలు పిల్లల వ్యక్తిత్వాన్ని చక్కగా రూపుదిద్దటమే కాకుండా, వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చి దిద్దుతాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అంతేకాదు, ఒక మంచి పని కోసం కుటుంబం అంతా కలిసికట్టుగా శ్రమించటం వల్ల, పిల్లలు పెరిగి పెద్దయ్యాక అవి తీపి జ్ఞాపకాలుగామిగిలిపోతాయని మనోవికాస నిపుణులు చెబుతున్నారు. ఇతరులకు సహాయం చేయడంలోని గొప్పతనం, ఔన్నత్యం 'వాలంటీరింగ్' ద్వారా పిల్లలకు అర్థం అవుతుంది. దీనివల్ల వారిలో జాలి, దయ, కరుణ, ఓర్పు, కృతజ్ఞతా భావం వంటి మంచి గుణాలు ఏర్పడతాయి. మనం చేసే చిన్న సాయమైనా ఒకరి జీవితంలో ఎంత పెద్ద మార్పును తీసుకురాగలదో పిల్లలు స్వయంగా తెలుసుకుంటారు.

### ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

తల్లిదండ్రులు పిల్లల్ని తరచూ సేవా కార్యక్రమాలలో పాలుపంచుకోవటానికి తీసుకెళ్లటం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇతరుల పట్ల ప్రేమతో మెలుగుతారు. నలుగురితో కలిసి పని చేయటం నేర్చుకుంటారు. సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యాలను అలవరచుకుంటారు.

### కుటుంబ బంధం బలపడుతుంది

ఇంట్లో అందరూ కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల, రోజూవారీ పనుల ఒత్తిడి లేకుండా కుటుంబ సభ్యులందరూ ఆహ్లాదకరమైన సమయాన్ని గడపవచ్చు. ఫోన్లకు, టీవీలకు లేదా ఇంటి పనులకే పరిమితం అయిపోకుండా.. ఒక మంచి లక్ష్యం కోసం అందరూ కలిసి పనిచేసినట్లవుతుంది. ఇది కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలపరుస్తుంది.

### ఎలాంటి సేవల్ని ఎంచుకోవాలి?

పిల్లల వయసును బట్టి, వారికి ఆసక్తి ఉన్న పనులు ఎంచుకోవడం ముఖ్యం. చిన్న పిల్లలైతే చేతులతో చేసే చిన్న చిన్న పనులను ఇష్టపడతారు, అదే కొంచెం పెద్ద పిల్లలైతే బాధ్యత తీసుకునే పనులను లేదా నాయకత్వం వహించే పనులకు చొరవ చూపుతారు. ఏమైనా, అది వారికి సరదాగా అనిపించాలి. ఆ పని తప్పక చేయాలనే ఉత్సాహం వారిలో కలగాలి. పనుల ఎంపికకు ఇవే గీటురాళ్లు. నెలకు ఒక్కసారి.. కుదరకపోతే రెండునెలలకు ఒక్కసారైనా వాలంటీరింగ్ చేసినా చాలు, అది పిల్లల జీవితాల్లో గొప్ప మార్పు తెస్తుంది.

### నివేదికలు..అధ్యయనాలు

'పాయింట్స్ ఆఫ్ లైట్' అనే స్వచ్ఛంద సంస్థ ఏటా 'ఫ్యామిలీ వాలంటీర్ డే' ని నిర్వహిస్తుంది. కుటుంబంతో కలిసి సేవ చేయడం వల్ల పిల్లల్లో సహానుభూతి పెరుగుతుందని, సామాజిక బాధ్యత అలవడుతుందని వారి అధ్యయనాలు చెబుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సర్వే ప్రకారం, స్వచ్ఛంద సేవల్లో పాల్గొనే పిల్లల్లో ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు 18 నుంచి 35 శాతం వరకు తక్కువగా ఉంటున్నాయి. ఇండియానా యూనివర్సిటీ జరిపిన సర్వేలో టీనేజర్లు, బాలలు సేవా కార్యక్రమాలలో పాల్గొనటం ద్వారా సమాజం తీరును గ్రహిస్తున్నారు. సానుకూల దృక్పథాన్ని ఏర్పరచుకుంటున్నారు. చిన్నప్పటి నుండి సేవ చేసే అలవాటు ఉన్న పిల్లలు, పెద్దయ్యాక కూడా సమాజానికి సేవ చేసే అవకాశం 50 శాతం ఎక్కువగా ఉంటుందని 'కార్పొరేషన్ ఫర్ నేషనల్ అండ్ కమ్యూనిటీ సర్వీస్' గణాంకాలు చెబుతున్నాయి.

# మైనర్ పై ట్రంప్ లైంగిక వేధింపులు ఎప్‌స్టీన్ కీలక పత్రాలు విడుదల



అమెరికా : అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం దాడులు కొనసాగుతున్న వేళ .... తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కీలక విషయాలు వెలుగుచూశాయి. తాను 13-15 ఏండ్ల వయసులో ఉన్నప్పుడు ట్రంప్ తనపై లైంగిక దాడి చేశారంటూ ఓ మహిళ ఆరోపణలకు సంబంధించిన కీలకపత్రాలు విడుదలయ్యాయి. ఇప్పటివరకు విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైళ్లలో ఇవి లేవు. అవి డూప్లికేట్ అని రాసి ఉన్న పత్రాల్లో కలిసిపోవడంతో గతంలో వాటిని విడుదల చేయలేదని న్యాయ శాఖ తెలిపింది. ఆ మహిళ 2019లో ఎఫ్‌బిఐకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం .... బాలల లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్‌స్టీన్ న్యూయార్క్ లేదా న్యూ జెర్సీ నగరాలలో తనను ట్రంప్‌నకు 1980లో పరిచయం చేశాడని, అప్పుడు తన వయసు 13-15 మధ్య ఉందని తెలిపింది. తర్వాత ట్రంప్ తనతో బలవంతంగా అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆ మహిళ ఆరోపించింది. తాను తిరస్కరించగా, ట్రంప్ తనను కొట్టాడని వివరించింది. ఈ నేపథ్యంలో ... కీలకమైన ఎప్‌స్టీన్ ఫైళ్లను దాచడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని డెమోక్రాట్లు ఆరోపించారు. దీనిపై విచారణకుగాను అటార్నీ జనరల్ బాండీకి సమన్లు జారీ చేయాలని హౌస్ కమిటీ నిర్ణయించింది.

# టెన్త్ పాసైన వారికి మమతా బెనర్జీ గుడ్ న్యూస్



కోల్‌కాతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరుద్యోగ యువతకు తీపి కబురు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు నెలకు రూ.1500 ఇస్తామని ప్రకటించారు. నేటి నుంచే( మార్చి 7, శనివారం) ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. 'యువ సాథీ' పేరుతో ప్రవేశపెట్టిన ఈ కొత్త పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని.. 21-40ఏళ్ల వారు ఈ పథకానికి అర్హులుగా మమతా బెనర్జీ తెలిపారు. కేవలం స్కాలర్‌షిప్‌లు తప్ప ఇతర ప్రభుత్వ పథకాల ప్రయోజనం పొందని వారు మాత్రమే దీనికి అర్హులన్నారు. వాస్తవానికి ఏప్రిల్ 1 నుండి ప్రారంభం ఈ పథకం ప్రారంభం కావాల్సిఉందని.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) కానుకగా ఒక రోజు ముందుగానే ఇవాళ నుంచి (మార్చి7) నుంచే అమలు చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఓటరు జాబితా సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)తో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో మమతా బెనర్జీ ఈ ప్రకటన చేశారు. కాగా, సీఎం తన ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక గణాంకాలను వెల్లడించారు. బెంగాల్‌లో నిరుద్యోగిత రేటు 40 శాతం తగ్గిందని ఆమె పేర్కొన్నారు. 'ఉత్కర్ష బంగ్లా' ద్వారా 40 లక్షల మందికి శిక్షణ ఇవ్వగా.. అందులో 10 లక్షల మందికి ఉపాధి లభించిందని మమతా తెలిపారు. బెంగాల్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (మీవీజు) దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని.. దాదాపు 1.5 కోట్ల మంది ఈ రంగంలో పని చేస్తున్నారని వివరించారు. బెంగళూరు కంటే బెంగాల్‌లోనే ఐటీ రంగంలో ఎక్కువ మందికి ఉపాధి లభిస్తోందంటూ ఆమె వ్యాఖ్యానించారు. రైతులకు నెలకు రూ.10,000 ఇస్తున్నామని, భూమి లేని రైతులకు కూడా రూ. నాలుగు వేలు సహాయం అందిస్తున్నామని తెలిపారు. బీర్భూమ్ జిల్లాలోని దేవుచా పచామి బొగ్గు గనుల ద్వారా లక్ష మందికి ఉపాధి లభిస్తుందని.. రాబోయే 100 ఏళ్ల వరకు రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఉండవని మమతా ధీమా వ్యక్తం చేశారు.

# రేవంత్.. రైతుభరోసా ఇచ్చే ఉద్దేశం లేదా?: హరీష్ రావు



కరీంనగర్: తెలంగాణలో కాంగ్రెస్ నేతలపై మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుభరోసా ఇచ్చే ఉద్దేశం ఉందా? లేదా? అని ప్రశ్నించారు. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా?. కాళేశ్వరం కూలిందని చిల్లర మాటలు మాట్లాడుతారా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద ఎండిపోయిన పంటలను శనివారం పరిశీలించారు. అనంతరం, హరీష్ మీడియాతో మాట్లాడుతూ..'మూడు పంటలకు రైతుభరోసా ఇవ్వాలన్న రేవంత్ రెడ్డి.. మూడు పంటలకూ డబ్బులు ఎగ్గొట్టాడు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని రైతుల దగ్గరకు పోతారు?. పోలీసులు లేకుండా జనం దగ్గరకు ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్లగలరా?. కాళేశ్వరం కూలిందని చిల్లర మాటలు మాట్లాడుతారా?. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే పంటలు పండుతున్నాయి. హైదరాబాద్‌కు తాగు నీరు కాళేశ్వరం నీళ్లే వెళ్తున్నాయి. రేవంత్ రెడ్డి.. ముందు చిల్లర వ్యాఖ్యలు బంద్ చేయండి. కాళేశ్వరం కూలిపోయింది అంటూ ఎన్నికల్లో అడ్డగోలు ఆరోపణలు చేస్తారా?. ప్రాజెక్ట్‌ను ఎండబెట్టాలని చూస్తున్నారా?. ఇప్పటికైనా మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్ చేయించండి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండేళ్లలో కనీసం పది వేల ఎకరాలకు నీరు ఇచ్చిందా అని ప్రశ్నించారు.

# 'కేరళ స్టోరీ'పై రాహుల్ విమర్శలు.. తిప్పికొట్టిన తివారీ భార్య






న్యూఢిల్లీ: ఇటీవల విడుదలైన 'ది కేరళ స్టోరీ 2' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీస్తోంది. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాను చూసేందుకు ప్రేక్షకులు ఎవరూ ఆసక్తి చూపడం లేదని, ఇది కేవలం విద్వేషాన్ని పెంచే సాధనంగా మారిందని ఆయన విమర్శించారు. అయితే ఈ చిత్రానికి బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ మద్దతుగా నిలిచారు. 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ ఈ సినిమాపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'కేరళ సంస్కృతి, అక్కడి సంప్రదాయాలపై దేశ ప్రజలకు పూర్తి అవగాహన ఉంది. అందుకే 'ది కేరళ స్టోరీ 2' వంటి చిత్రాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక వర్గాన్ని కించపరచడానికి, సమాజంలో చీలికలు తీసుకురావడానికి సినిమాలను వాడుకుంటున్నారు. దీనివల్ల కొన్ని శక్తులు రాజకీయ లబ్ధి పొందుతుంటే, సామాన్య ప్రజలు నష్టపోతున్నారు' అని రాహుల్‌పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛపై కూడా రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎవరైనా తమ గొంతు వినిపించాలని చూస్తే వారిపై దాడులు జరుగుతున్నాయి. అయితే కొన్ని వర్గాలకు అనుకూలమైన కథనాలను యథేచ్ఛగా ప్రచారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు' అని రాహుల? ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రాహుల్ విమర్శలకు భిన్నంగా, బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ భార్య సురభి తివారీ ఈ చిత్రానికి మద్దతుగా నిలిచారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో ఆమె మాట్లాడుతూ.. 'లోకం అన్న తర్వాత రకరకాల మాటలు వినిపిస్తూనే ఉంటాయి. అయితే ఇంటి వద్ద కూర్చుని విమర్శలు చేసే కంటే, థియేటర్లకు వెళ్లి సినిమా చూడమని నేను కోరుతున్నాను. ఆ తర్వాతే ఇది ప్రచార చిత్రమా లేక సమాజానికి అద్దం పట్టే వాస్తవమా అనేది అర్థమవుతుంది. హిందూ అమ్మాయిలు ఎదుర్కొంటున్న వేధింపులకు ఇది నిదర్శనం. ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని ఆమె పేర్కొన్నారు.

# అంతరిక్షపుటంచు నుంచి...

నిత్యం కట్టుదిట్టమైన భద్రత మధ్య అప్రమత్తంగా ఉండే ఇరాన్ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ సైన్యం అత్యంత కచి?చతత్వంతో కూడిన దాడికి పాల్పడి హత్య చేసింది. 37 ఏళ్లపాటు ఇరాన్‌ను ఒంటిచేత్తో ఏలిన ఖమేనీ కథ చివరకు విషాదంగా ముగిసింది. గత 28న రాజధాని టెహ్రాన్‌లో నడి'ద్దున అత్యున్నత స్థాయి సమావేశంలో ఉండగా జరిగిన దాడిలో మరణించారు. అసలీ దాడి ఎలా జరిగింది, ఖమేనీ అంతం చూసేందుకు ఇజ్రాయెల్ ప్రయోగించిన ఆయుధం ఏమిటనేవి చర్చనీయాంశంగా మారాయి. ఇజ్రాయెల్ సైన్యం 'బ్లూ స్పారో' అనే ఖండాంతర క్షిపణిని ప్రయోగించి లక్ష్యం సాధించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ మిసైల్‌ను 'రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్' సంస్థ అభివృద్ధి చేసింది. ఇది అత్యంత ప్రాణాంతక ఆయుధమని చెప్పుకోవచ్చు. ఒక్కసారి లక్ష్యం వైపు దూసుకెళ్లిందంటే దాన్ని మధ్యలో అడ్డుకోవడమే అసాధ్యమే. గురి తప్పే ప్రసక్తే లేదు. శత్రువు నేల కూలాల్సిందే!

## అసలేమిటి నీలి పిచ్చుక?

మూడు బాలిస్టిక్ టార్గెట్ క్షిపణుల కుటుంబంలో బ్లూ స్పారో కూడా ఒకటి. ఇందులో బ్లాక్ స్పారో, సిల్వర్ స్పారో కూడా ఉన్నాయి. మరో ఖండంలో సుదూరంలోని లక్ష్యాలను ఛేదించడానికి బాలిస్టిక్ క్షిపణులను ఫైటర్ జెట్ లేదా రాకెట్‌కు అమర్చి ప్రయోగిస్తారు. గాల్లోకి లేచిన క్షిపణి తర్వాత ఫైటర్ జెట్ నుంచి విడిపోయి భూ వాతావరణపు అంచుల దాకా వెళ్తుంది. తర్వాత గురుత్వాకర్షణ శక్తితో భూమి దిశగా ప్రయాణించి లక్ష్యాన్ని తాకి పేలిపోతుంది. ఇది ఒక బంతిని గాల్లోకి విసరడం లాంటిదే. పైకి వెళ్లిన బంతి గురుత్వాకర్షణ శక్తి ప్రభావంతో మళ్లీ భూమిని తాకుతుంది. అందుకే దీన్ని 'అంతరిక్ష క్షిపణి'గా కూడా పిలుస్తుంటారు. నిజానికి బ్లూ స్పారో, బ్లాక్ స్పారో, సిల్వర్ స్పారో క్షిపణులను ఇజ్రాయెల్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో భాగంగా ప్రాక్టీస్ కోసం అభివృద్ధి చేశారు. శత్రుదేశాల బాలిస్టిక్ క్షిపణులను ముందే గుర్తించి, నేలమట్టం చేయడం ఈ డిఫెన్స్ సిస్టమ్ విధి. ఇక్కడ శత్రుదేశాల క్షిపణుల స్థానంలో స్పారో మిస్సైళ్లను డమ్మీగా ఉపయోగించి, ప్రాక్టీస్ చేస్తుంటారు. యుద్ధ రంగంలోనూ ఉపయోగిస్తున్నారు. బ్లూ స్పారో పొడవు 6.51 మీటర్లు. బరువు



1,900 కిలోలు. సింగిల్ స్టేజ్ సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్ రాకెట్ ఉంటుంది. జీపీఎస్‌తోపాటు ఐఎన్ఎస్ నావిగేషన్ సిస్టమ్‌తో ముందుకెళ్తుంది. బయటి నుంచి అందే సిగ్నల్‌తో పనిలేకుండా తన కదలికలు నిర్దేశించుకోగలదు. బ్లూ స్పారో మిస్సైల్ లండన్ బస్సు పరిమాణంలో ఉంటుంది.

## బ్లూ స్పారో స్ఫూర్తితో 'రాక్స్'

ఇతర దేశాల అత్యాధునిక క్షిపణులకు దీటుగా బ్లూ స్పారోను డిజైన్ చేశారు. భూవాతావరణాన్ని దాటి ముందుకెళ్లి, మళ్లీ భూవాతావరణంలోకి ప్రవేశించి లక్ష్యాన్ని తాకడం ఈ నీలి పిచ్చుక ప్రత్యేకత. ఫైటర్ జెట్‌కు అమర్చిన బ్లూ స్పారో ఆకాశంలో భూవాతావరణం పరిధి వరకూ వెళ్లి విడిపోతుంది. అలాగే పైకి దూసుకెళ్లి భూవాతావరణం అంచును దాటేస్తుంది. పేలుడు పదార్థాలు కూర్చిన క్షిపణి ముందుభాగం వెనుక భాగం నుంచి విడిపోయి భూమి దిశగా వేగంగా ప్రయాణిస్తుంది. అలా కిందికి వచ్చే భాగాన్ని రీ--ఎంట్రీ వెహికల్ అంటారు. ఇందులో వార్‌హెడ్‌తోపాటు చిన్నపాటి థ్రస్టర్లు ఉంటాయి. శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేని రీతిలో నిట్టనిలువుగా కిందికి వచ్చి అత్యంత వేగంగా లక్ష్యాన్ని ఛేదిస్తుంది. 'ఆపరేషన్ రోరింగ్ లయన్'లో భాగంగా ఫిబ్రవరి 28న ఉదయం టెహ్రాన్‌లో ఖమేనీ నివాసాన్ని బ్లూ స్పారో ఇదే తరహాలో ధ్వంసం చేసింది. ప్రాక్టీస్ కోసం అభివృద్ధి చేసిన ఒక మిస్సైల్ ఇరాన్ సుప్రీంలీడర్‌ను బలి తీసుకుంది. రఫేల్ సంస్థ బ్లూ స్పారో డెవలప్‌మెంట్‌తోనే ఆగిపోలేదు. సరిగ్గా ఇదే టెక్నాలజీతో 'రాక్స్'ను అభివృద్ధి చేసింది. ప్రతికూల వాతావరణంలో సైతం అసాధారణమైన కచి?చతత్వంతో లక్ష్యాలను ఛేదించడం రాక్స్ క్షిపణుల ప్రత్యేకత. శత్రుదేశాలు జీపీఎస్ సిగ్నల్స్‌ను జామ్ చేసినా సరే ఈ క్షిపణులు సరిగ్గా పనిచేస్తాయి. భూఉపరితలంతోపాటు అంతర్భాగంలోని లక్ష్యాన్ని తాకుతాయి. 500 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్లగలదు. బ్లూ స్పారో ఒక స్కెచ్(చిత్తుప్రతి) అనుకుంటే రాక్స్ అనేది పూర్తిగా సిద్ధమైన ఆయుధం.

# భీకరపోరుకు 7 రోజులు

- అల్లాడిపోతున్న పశ్చిమాసియా
- వెనక్కు తగ్గని ఇజ్రాయెల్-- అమెరికా, ఇరాన్
- భారీగా సాగుతున్న దాడులు, ప్రతి దాడులు
- కనుచూపు మేరల్లో కనిపించని ముగింపు
- ఇరాన్‌కు ఇప్పటికే తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం
- పౌర, సైనిక నాయకత్వాన్నీ కోల్పోయిన వైనం
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలకూ భారీగా నష్టాలు



దాడులు చేయడంతో పశ్చిమాసియా నిప్పుల కుంపటిగా మారింది.

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధానికి తెర తీసి ఏడు రోజులు పూర్తయ్యాయి. తీవ్రస్థాయి దాడులు, ప్రతి దాడులతో వారం రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్ దద్దరిల్లిపోతున్నాయి. గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ ఇరాన్ లక్ష్యం చేసుకోవడంతో పశ్చిమాసియాలోని పలు ఇతర దేశాలు కూడా దాడుల బారిన పడుతున్నాయి. హోర్ముజ్ జలసంధి గుండా సరుకు రవాణా పడకేయడంతో చమురు ధరలకు రెక్కలొస్తున్నాయి. ఇప్పటిదాకా ఇరాన్‌లో కనీసం 1,300 మందికి పైగా మరణించారు. లెబనాన్, ఇజ్రాయెల్‌లో పదుల కొద్దీ మరణాలు సంభవించాయి. ఇరాన్‌పై దాడులను కనీసం మరో రెండు వారాలు కొనసాగిస్తామని ఇజ్రాయెల్, నాలుగైదు వారాలు పట్టొచ్చని అమెరికా చెబుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అంతేగాక హెజ్బొల్లా గ్రూపు వంటివాటి రంగప్రవేశంతో రోజులు గడుస్తున్న కొద్దీ యుద్ధం మరింతగా విస్తరిస్తూ వస్తోంది. పశ్చిమాసియా కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. దీని ప్రభావం ప్రపంచ దేశాలన్నింటిపైనా దీర్ఘకాలం పాటు కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. వారం రోజుల పాటు యుద్ధం ఎలా సాగిందో చూస్తే...

## ఒకటో రోజు

ఆపరేషన్ రోరింగ్ లయన్ పేరిట ఇజ్రాయెల్, ఎపిక్ ఫ్యూరీ పేరుతో అమెరికా ఫిబ్రవరి 28న శనివారం ఇరాన్‌పై భారీ స్థాయి యుద్ధానికి దిగాయి. బరిలోకి దిగుతూనే ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీని హత్య చేయడం ద్వారా ఏకంగా కుంభస్థలాన్నే కొట్టాయి! ఆయన నివాస, కార్యాలయ ప్రాంగణంలో అత్యున్నత స్థాయి రక్షణ భేటీ జరుగుతుండగా పక్కా సమాచారంతో ఇజ్రాయెల్ దాడికి దిగింది. ఏకంగా 30కి పైగా బాంబులతో విరుచుకుపడింది. ఖమేనీ ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోవద్దనే ఉద్దేశంతో అత్యంత శక్తిమంతమైన బ్లూ స్పారో క్షిపణిని కూడా ప్రయోగించినట్టు తాజాగా తేలింది! ఖమేనీ భార్య, కోడలుతో పాటు కనీసం 40 మందికి పైగా ఉన్నత స్థాయి నేతలు, సైనిక కమాండర్లు కూడా ఈ దాడిలో మరణించారు. ఆ వెంటనే ఇరాన్ అణు, సైనిక, క్షిపణి లంచ్ ప్యాడ్ వ్యవస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికా 100కు పైగా యుద్ధ విమానాలతో విరుచుకుపడ్డాయి. ప్రభుత్వ భవనాలు, అధ్యక్ష భవనంతో పాటు రాజధాని టెహ్రాన్‌వ్యాప్తంగా క్షిపణుల వర్షం కురిసింది. ఓ స్కూలుపై జరిగిన దాడిలో 165 మందికి పైగా విద్యార్ి?థనులు దుర్మరణం పాలయ్యారు. అనూహ్య దాడి నుంచి తేరుకుని ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై భారీగా క్షిపణులు, డ్రోన్లతో ప్రతి దాడికి దిగింది. గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలను కూడా లక్ష్యం చేసుకుంటూ యూఏఈ మొదలుకుని దోహా దాకా పలు దేశాలపై

## రెండో రోజు

ఇరాన్‌కు చెందిన తొమ్మిది యుద్ధ నౌకలను అమెరికా ముంచేయడంతో యుద్ధం మరింతగా విస్తరించింది. అత్యంత శక్తిమంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రధాన కార్యాలయాన్ని ఇజ్రాయెల్ దాడులు నేలమట్టం చేశాయి. ఇరాన్‌వ్యాప్తంగా 100కు పైగా నగరాలపైకి దాడులు విస్తరించాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం నమోదయ్యాయి. ఇరాన్ దాడుల్లో అమెరికాకు కూడా గట్టి ఎదురుదెబ్బే తగిలింది. కువైట్‌లోని సైనిక స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ఆరుగురు అమెరికా సైనికులు మరణించారు. ఇజ్రాయెల్‌లోని బేట్ షెమెష్ నగరంలోనూ 9 మంది మృత్యువాత పడ్డారు.

## మూడో రోజు

హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్ సరిహద్దులపైకి క్షిపణులు ప్రయోగించడంతో యుద్ధం లెబనాన్‌కు కూడా విస్తరించింది. అక్కడి హెజ్బొల్లా స్థావరాలు, ఆయుధ నిల్వలే లక్ష్యంగా సోమవారం ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దాంతో ఒక్క బీరూట్‌లోనే 31 మందికి పైగా మరణించారు. దేశమంతటా మృతుల సంఖ్య 50 దాటింది. గల్ఫ్‌లోని చమురు క్షేత్రాలను ఇరాన్ లక్ష్యం చేసుకుంది! డ్రోన్ దాడుల్లో సౌదీ అరేబియాలోని రస్ తనూరా రిఫైనరీపై స్వల్పంగా దెబ్బ తింది. దాంతో ఆ క్షేత్రాన్ని సౌదీ మూసేసింది. కువైట్ ఫైటర్ జెట్ జరిపిన 'ఫ్రెండ్లీ ఫైర్'లో అమెరికా ఏకంగా మూడు యుద్ధవిమానాలను కోల్పోయింది! వాటిలోని పైలట్లు మాత్రం సురక్షితంగా తప్పించుకున్నారు. వాటిని కూలి?చంది తమ యుద్ధ విమానాలేనని ఇరాన్ చెప్పుకొచ్చింది.

## నాలుగో రోజు

ఇరాన్‌పై దాడులను అమెరికా తీవ్రతరం చేసింది. సైనిక స్థావరాలు, అణు కేంద్రాలపై బీ--2 బంకర్ బస్టర్ బాంబులతో విరుచుకుపడింది. దాంతో ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై ప్రతి దాడులను తీవ్రతరం చేసింది. కీలకమైన హోర్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్టు ప్రకటించింది. దానిగుండా ప్రయాణించే నౌకలకు నిప్పు పెడతానని హెచ్చరించింది. అంతటితో ఆగకుండా సౌదీ రాజధాని రియాద్‌తో పాటు కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయాలపై డ్రోన్ దాడులకు దిగింది. దాంతో వాటిని మూసేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. దోహా, దుబాయ్, అబుదాబి, బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ పెద్దపెట్టున దాడులు జరిపింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భూతల పోరుకు దిగింది! 80 సరిహద్దు గ్రామాల వారిని ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందిగా హెచ్చరించింది.

## ఐదో రోజు

యుద్ధం టర్కీ దాకా విస్తరించింది. ఆ దేశంపైకి ఇరాన్ ఏకంగా ఖండాంతర క్షిపణులను ప్రయోగించింది. భారత్‌తో సంయుక్త విన్యాసాల్లో పాల్గొని తిరుగుముఖం పట్టిన ఇరాన్‌కు చెందిన భారీ యుద్ధ నౌక ఐఆర్ఐఎస్ దేనాపై శ్రీలంక తీర సమీపంలో అమెరికా దాడి చేసింది. మార్క్--48 టోర్పెడో ప్రయోగించి దాన్ని ముంచేసింది. నౌకలోని 120 మందిలో 87 మంది మరణించారు. గల్ఫ్‌లోని తమ స్థావరాలను కాపాడుకునేందుకు పలు యూరప్ దేశాలు కూడా ఆయుధ వ్యవస్థలను మోహరించాయి.

## ఆరో రోజు

టెహ్రాన్ గగనతలంలో ఇరాన్ సుఖోయ్--35 యుద్ధ విమానాన్ని ఇజ్రాయెలీ ఎఫ్--35 ఫైటర్ జెట్ నేలకూల్చింది. ఇరాన్‌లో 170కి పైగా నగరాలు దాడులకు గురైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 1,230 దాటింది. తమ యుద్ధ నౌకను ముంచేసిన అమెరికాపై ఇరాన్ ప్రతీకార దాడికి దిగింది. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా చమురు నౌకపై డ్రోన్లు, బోట్లతో దాడికి దిగింది. కువైట్, ఇరాక్‌ల్లో కూడా మరో రెండు చమురు నౌకలను నష్టపరిచింది. దాడులు అజర్‌బైజాన్‌కు కూడా విస్తరించాయి. ఇరాన్ డ్రోన్ల దాడిలో అక్కడి నఖ్‌చివాన్ విమానాశ్రయం స్వల్పంగా దెబ్బతింది.

## ఏడో రోజు

ఇరాన్‌పై క్షిపణులు, బాంబులతో ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగాయి. దక్షిణ ఇరాన్‌ను అమెరికా, మధ్య, పశ్చిమ ప్రాంతాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుని ఎడతెరిపి లేకుండా క్షిపణి దాడులు చేశాయి. లెబనాన్‌పై కూడా దాడులను ఇజ్రాయెల్ మరింతగా పెంచింది. టెల్ అవీవ్‌పై ఇరాన్ భారీగా క్షిపణి దాడులకు దిగింది. పశ్చిమాసియా, పరసర ప్రాంతాల్లో ఇప్పటికే 14 దేశాలు యుద్ధంతో ప్రభావితమవుతున్నాయి.

## ఎన్నెన్ని సమస్యలో!

యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలకు నానా సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం దాకా జరిగే హోర్మూజ్ జలసంధి మూతబడింది. దాంతో సరఫరా తగ్గి చమురు ధరలు ఇప్పటికే 10 శాతానికి పైగా పెరిగిపోయాయి. ఈ ప్రభావం భారత్‌పైనా అధికంగానే పడుతోంది. తాత్కాలిక ప్రత్యామ్నాయంగా మళ్లీ రష్యా చమురు వైపు చూడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. హోర్మూజ్ గుండా భారత్‌కు వచ్చే పామాయిల్, పప్పులు, ఔషధాల దిగుమతులు ఆగిపోవడంతో వాటి ధరలు పెరిగేలా కనిపిస్తున్నాయి. అలాగే పశ్చిమాసియా దేశాలకు మన బాస్మతి బియ్యం ఎగుమతులపైనా ప్రభావం పడుతోంది. పశ్చిమాసియా నుంచి సహజ వాయువు సరఫరాలు కూడా పడకేశాయి. దాంతో వాటిపై అధికంగా ఆధారపడే యూరప్, ఆసియా దేశాలు కూడా అల్లాడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రవాణా కూడా తీవ్రంగా ప్రభావితమైంది. పశ్చిమాసియాలో ఈ వారం రోజుల్లో ఏకంగా 11 వేల విమానాలు రద్దయ్యాయి! ఆ దేశాల్లో లక్షలాదిగా ప్రయాణికులు చిక్కుబడిపోయారు.

ఏం జరగనుంది?

యుద్ధం కనీసం మరో రెండు వారాలు, అంతకుమించి కొనసాగేలా కనిపిస్తోంది. అయితే రెండు రోజులుగా ఇరాన్ దాడుల తీవ్రత తగ్గినట్టు అమెరికా చెబుతోంది. క్షిపణి దాడులు 90 శాతం, డ్రోన్ దాడులు 83 శాతం తగ్గుముఖం పట్టాయంటోంది. నానాటికీ నిండుకుంటున్న ఆయుధ నిల్వలే ఇందుకు కారణం కావచ్చు. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను 80 శాతానికి పైగా నాశనం చేసి దాని గగనతలంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించినట్టు ఇజ్రాయెల్ చెబుతోంది. అమెరికా వద్ద కూడా క్షిపణి నిల్వలు మరో వారం రోజులకు మించి లేవని పెంటగాన్ నివేదిక పేర్కొంది. కానీ తొలి రోజే నాయకున్ని కోల్పోయినా ఇరాన్ మాత్రం మొండిగా పోరాడుతూనే ఉంది.

# ఏఐ సంక్షోభం.. ఏం చేయాలో ఆలోచించాలి!




ప్రపంచంలోని టాప్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీల్లో ఒకటిగా ఉన్న జేపీ మోర్గాన్ చేజ్ సీఈఓ జామీ డిమోన్ టెక్నాలజీలో వస్తున్న మార్పులపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. మొన్నటి వరకు వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతిని తీవ్రంగా వ్యతిరేకించిన డిమోన్.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వల్ల పని దినాలు తగ్గుతాయని అంచనా వేయడం గమనార్హం.

## వారానికి 3.5 రోజుల పనే!

బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డిమోన్ మాట్లాడుతూ.. ఏఐ ప్రభావంతో భవిష్యత్ తరాల జీవనశైలి పూర్తిగా మారిపోతుందని పేర్కొన్నారు. 'వచ్చే మూడు నాలుగు దశాబ్దాల్లో మన పిల్లలు వారానికి కేవలం నాలుగు లేదా మూడున్నర రోజులు మాత్రమే పని చేసే స్థాయికి ఏఐ ఉత్పాదకతను పెంచుతుంది' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత వల్ల పని గంటలు తగ్గి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మెరుగుపడటం అనేది ఒక అద్భుతమైన విషయం అన్నారు.

## జేపీ మోర్గాన్‌లో ఇప్పటికే ఏఐ జోరు

కేవలం అంచనాలు వేయడమే కాకుండా, తన బ్యాంకులో ఇప్పటికే ఏఐని భారీగా వినియోగిస్తున్నట్లు డిమోన్ వెల్లడించారు. మోసాల గుర్తింపు, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఎర్రర్ రిడక్షన్ వంటి చాలా విభాగాల్లో ఏఐని వాడుతున్నట్లు చెప్పారు. సంస్థలోని సుమారు 1,50,000 మంది ఉద్యోగులు ఇప్పటికే లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సాంకేతికత ఎప్పుడూ ఉద్యోగాలను మారుస్తూనే ఉంటుంది. కానీ ఏఐ తెచ్చే మార్పులు వేగంగా ఉంటాయి. ప్రభుత్వం, వ్యాపార సంస్థలు ఈ మార్పునకు ఇప్పుడే సిద్ధం కావాలి' అని జామీ డిమోన్ తెలిపారు.

ఉద్యోగ ముప్పుపై హెచ్చరిక

ఒకవైపు ఆశావాదాన్ని ప్రకటిస్తూనే, మరోవైపు ఉద్యోగాల తొలగింపుపై డిమోన్ వాస్తవాలను బయటపెట్టారు. పరిశ్రమలు ఏఐని స్వీకరించే క్రమంలో ఉద్యోగాల నష్టాన్ని తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించారు. రాబోయే ఐదేళ్లలో ఏఐ వల్ల పెరిగే ఉత్పాదకత కారణంగా బ్యాంకులో తక్కువ మంది ఉద్యోగుల అవసరం ఉంటుందని అంగీకరించారు. ఉద్యోగాలు కోల్పోయే వారిని ఎలా ఆదుకోవాలనే అంశంపై ప్రభుత్వాలు, సంస్థలు ఆలోచించాలని సూచించారు.

# వర్జిన్ కోకోనట్‌తో వండర్స్..!



సాధారణ కొబ్బరి తోటను ఒక అద్భుతమైన 'సూపర్ ఫుడ్' ఉత్పత్తి కేంద్రంగా, వ్యవసాయ పర్యాటక స్థలంగా మార్చవచ్చా? నిస్సందేహంగా అంటున్నాడు గోవాకు చెందిన యువ రైతు పారిశ్రామికవేత్త రోహన్. తన తండ్రి నాటిన తోట అది. కొబ్బరి కాయలను మాత్రమే అమ్మేవారు. కరోనా తర్వాత ఈ ఫామ్‌పై దృష్టి సారించిన రోహన్ ఈ తోట రూపు రేఖలు మార్చేశారు. ఐదేళ్లలో తన కలను సాకారం చేసుకున్నారు. కొబ్బరి కాయలు, బోండాలు అమ్మే చోట.. కొబ్బరి పాల నుంచి ప్రత్యేక పద్ధతిలో 'వర్జిన్ కోకోనట్ ఆయిల్'ను ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు. చెట్టుకు కాసే కాయ నుంచి వర్జిన్ కొబ్బరి నూనె తయారీ వరకు చేసే పనులను స్వయంగా చూడాలనుకునే వారికి ఫామ్ విజిట్‌కు ఆహ్వానిస్తున్నారు. పనిలో పనిగా సంప్రదాయ గోవా గ్రామీణ వంటకాలను రుచిచూపిస్తున్నారు. ఇటు వ్యవసాయ పర్యాటకం, అటు ఆరోగ్యదాయకమైన నూనె ఉత్పత్తితో మంచి ఆదాయం గడిస్తున్న రోహన్ యువ కొబ్బరి 'రైతు పారిశ్రామిక వేత్త'గా ఆదర్శప్రాయుడయ్యారు. కొబ్బరైనా మరొకటైనా కేవలం పండించి ముడిసరుకుగా అమ్మజూపితే రైతుకు దక్కేది మార్కెట్ ధరలో కొంచమే. రూపం మార్చి, కొంచెం వ్యాపార దృష్టిని కలిపి అమ్మటం నేర్చుకుంటేనే రైతుకు ఆర్థిక భద్రత, సుస్థిరత చేకూరుతుంది. రైతులు ఆర్థికంగా నిలబెట్టే మెలకువలు బోధించే నిపుణులు చెబుతుండే ఈ సూత్రాన్ని తు.చ. తప్పకుండా పాటించారు రోహన్. మైక్రోబయాలజిస్ట్‌గా శిక్షణ పొందిన రోహన్ ఎంబీఏ పూర్తిచేసి 2021 వరకు బెంగళూరులో వివిధ సంస్థల్లో దశాబ్దానికి పైగా పనిచేశాడు. కరోనా తర్వాత కుటుంబానికి చెందిన సంప్రదాయ కొబ్బరి తోటపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి గుణాత్మకమైన మార్పు సాధించారు. ఉత్తర గోవాలోని ముల్గావ్ అనే గ్రామంలోని ఒక చిన్న కొబ్బరి తోట వారిది. ఆరోగ్య స్పృహతో కూడిన వర్జిన్ కొబ్బరి నూనె బ్రాండ్‌ను నిర్మించాడు. శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వర్జిన్ కొబ్బరి నూనెను ఉత్పత్తి చేస్తున్నారు. స్థానికులకు జీవనోపాధిని కల్పిస్తున్నారు. సాధారణ కొబ్బరి కాయలను ఉత్పత్తి చెయ్యటానికి బదులు సమాజానికి ఔషధగుణాలు కలిగి ఉండే వర్జిన కొబ్బరి నూనెను గౌరవప్రదంగా ఎలా ఉత్పత్తి చేసి లాభదాయకంగా ఎలా అమ్మొచ్చో తెలియజెబుతున్నారు. 'నిదానంగా తయారు చేసిన నిజమైన ఆహారం' గురించి తెలుసుకోవాలనుకునే వారికి చక్కటి వ్యవసాయాధారిత పరిశ్రమను కళ్ల ముందుంచుతున్నారు.

## నూనె ఉత్పత్తికి ఆరు గంటలు..

ఆ తోటలో రోహన్ తండ్రి చాన్నాళ్ల క్రితం నాటిన దాదాపు 200 ఎత్తుగా ఎదిగిన కొబ్బరి చెట్లు ఉన్నాయి. 150కి పైగా లేత మొక్కలున్నాయి. సాధారణ కొబ్బరి నూనె తలకు రాసుకునే నూనెగా, కొన్ని సార్లు వంట నూనెగా ఉపయోగించడానికి మించి ప్రజలకు మేలైన ఆరోగ్యాన్నందించే సూపర్‌ఫుడ్‌గా అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందని అతను నమ్మాడు. కొబ్బరి పాలతో తయారు చేసే వర్జిన్ కొబ్బరి నూనె రూపంలోకి మార్చటానికి రోహన్ వ్యక్తిగత శ్రద్ధతో కృషి చేశారు. పచ్చి కొబ్బరి నుంచి పాలు తీసిన తర్వాత, ఆ పాల నుంచి ట్రేడ్‌మార్క్ చేసిన 'హాట్ ఎక్స్‌ట్రాక్షన్ యాంటీఆక్సిడెంట్ లాడెన్' పద్ధతిలో పోషకాలు పోకుండా నెమ్మదిగా నూనెను వెలికి తీస్తారు. ఈ ప్రక్రియకు 6 గంటల సమయం పడుతుంది. ఫలితంగా నూనె సహజంగా యాంటీఆక్సిడెంట్లు, లారిక్ ఆమ్లంతో సమృద్ధిగా ఉంటుంది. తల్లి పాలలో ఉండే ముఖ్యమైన కొవ్వు ఆమ్లం, దాని యాంటీమైక్రోబియల్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది.

## మోస్తరు వేడితో నష్టం లేదు

'ఈ ప్రక్రియలో మోస్తరు వేడిని ఉపయోగించటం వల్ల నష్టమేమీ లేదు. విపరీతమైన వేడిని వాడితే నష్టం. స్వచ్ఛతను, విశిష్టతను కాపాడుతూ సూపర్ ఫుడ్‌ని ఉత్పత్తి చేస్తున్నాం' అని రోహన్ వివరించాడు. ఈ తోటలో దేన్నీ వృథాగా పారెయ్యటం లేదు. కొబ్బరి పొట్టును చెట్ల కింద ఆచ్ఛాదనగా వేస్తున్నారు. ఈ పంట వ్యర్థం తిరిగి మట్టిలోకి చేరుతోంది. కొబ్బరి పెంకులను యాక్టివేటెడ్ కార్బన్‌గా మార్చి తిరిగి వినియోగిస్తున్నారు. నూనె ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే పిప్పితో వర్మీకం?ోస్టు తయారు చేస్తున్నారు. కొబ్బరిలోని ప్రతి భాగం పర్యావరణ వ్యవస్థలో పాత్ర పోషించేలా చూసుకోవడమే లక్ష్యమని రోహన్ చెప్పారు.

## రోజూ ఒక చెంచా..

'వర్జిన్ కొబ్బరి నూనె పొట్ట ఆరోగ్యం, జీవక్రియ, కొలెస్ట్రాల్ నిర్వహణకు తోడ్పడుతుంది. దానిలోని యాంటీఆక్సిడెంట్లు, ప్రయోజనకరమైన మీడియం--చైన్ ఫ్యాటీ యాసిడ్ అయిన లారిక్ యాసిడ్ ఇందుకు ప్రధాన కారణం. అందుకే ప్రతి రోజూ ఒక చెంచా వర్జిన్ కొబ్బరి నూనెను తీసుకుంటే ఆరోగ్యం..' అంటారు రోహన్. 'నేను వర్జిన్ కొబ్బరి నూనె తీసే పని చేస్తాను. కొబ్బరి కాయల నుంచి కొబ్బరి తీసి ముక్కలు చేసి రుబ్బుతాం. అందులో నుంచి తర్వాత ?లు తీస్తాం. ఇది దాదాపు ఆరు గంటల పాటు నెమ్మదిగా జరిగే ప్రక్రియ' అని ఒక కార్మికుడు చెపారు.

## వ్యవసాయ పర్యాటకం

విలువలకు నిలబడుతూ శ్రద్ధగా ఆరోగ్యదాయకమైన, ?ోషకవంతమైన వ్యవసాయోత్పత్తులను ఉత్పత్తి చేసే వ్యవసాయ క్షేత్రం పర్యాటక కేంద్రంగా కూడా పేరుగాంచుతుందనటానికి రోహన్ క్షేత్రమే ఉదాహరణ. ఆసక్తి గల వారు బుక్ చేసుకొని 2.5 గంటల వ్యవసాయ ఆధారిత అనుభవాలను చవిచూస్తున్నారు. అతిథులు కొబ్బరి తోటల గుండా నడుస్తూ విషయాలు తెలుసుకుంటారు. చెట్టు నుంచి కాయలు కోయటం దగ్గరి నుంచి నూనె తయారీ వరకు జరిగే పనులన్నిటినీ చూస్తారు. స్థానిక పదార్థాలను ఉపయోగించి గ్రామీణ మహిళలు వండిన సాంప్రదాయ గోవా భోజనంతో ఈ అనుభవం ముగుస్తుంది. 'ఇది ఎక్కువ మందిని ఆకర్షించే పర్యాటకం కాదు. జీరో వేస్ట్ క్షేత్ర నిర్వహణ, ఆరోగ్యదాయకమైన ఆహారంపై సంభాషించడానికి మేం ఒక బ్యాచ్‌లో కొద్ది మందికి మాత్రమే ఆతిథ్యం ఇస్తామ'ని రోహన్ స్పష్టం చేశారు. త్వరలో కొబ్బరితో చిరుతిండ్లను ఉత్పత్తి చెయ్యనున్నామన్నారు. టోక్యోకి చెందిన అంతర్జాతీయ పర్యాటక సంస్థ స్కాల్ ఇంటర్నేషనల్ నుంచి గుర్తింపు దక్కటం ఆనందదాయకమని ఆయన సంబరపడుతున్నారు.

# ఏఐపై అత్యంత భారీ పెట్టుబడులు

### 240 బిలియన్ డాలర్లకు కట్టుబాటు ఏఐ సదస్సులో దిగ్గజాల వెల్లడి జాబితాలో ఆర్ఐఎల్, అదానీ, గూగుల్, టాటా

### ప్రభుత్వ గణాంకాల విడుదల

ఇటీవల నిర్వహించిన 2026 ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో భారీ పెట్టుబడులకు తెరలేచినట్లు ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఏఐపై కార్పొరేట్ దిగ్గజాలు రిలయన్స్ ఇండస్ట్రీస్‌సహా అదానీ గ్రూప్, గూగుల్, టాటా, లైట్‌స్పీడ్ వెంచర్స్ తదితరాలు ఉమ్మడిగా 240 బిలియన్ డాలర్లు(రూ. 21.84 లక్షల కోట్లు) ఇన్వెస్ట్ చేసేందుకు కట్టుబాటును ప్రదర్శించాయి. గత నెల 16--21 మధ్య నిర్వహించిన ఏఐ సదస్సు సుమారు 6 లక్షల మంది హాజరైన అతిపెద్ద ఈవెంట్‌గా నిలుస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 100 దేశాల నుంచి ప్రతినిధులు, 20 అంతర్జాతీయ సంస్థలు వీటిలో పాలుపంచుకున్నట్లు వెల్లడించింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫౌండేషన్ మోడళ్లు, హార్డ్‌వేర్, అప్లికేషన్లు తదితర విభాగాలలో 200 బిలియన్ డాలర్లకుపైగా ఏఐ సంబంధిత పెట్టుబడులకు కట్టుబాటు కనిపించినట్లు తెలియజేసింది.

దిగ్గజాలు ఇలా..




ఏఐ సదస్సులో డైవర్సిఫైడ్ దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏఐ ఆధారిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 110 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసేందుకు ప్రణాళికలు ప్రకటించింది. ఏడేళ్లలో వీటిని వెచ?ంచనున్నట్లు తెలియజేసింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2035కల్లా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలు వెల్లడించింది. జనరల్ కేటలిస్ట్ ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్‌కు కమిట్‌మెంట్‌ను ప్రకటించింది. ఈ బాటలో లైట్‌స్పీడ్ వెంచర్ పార్ట్‌నర్స్ 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు సిద్ధమని తెలియజేసింది. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ కొత్తగా ఇండియా-- యూఎస్ సబ్‌సీ కేబుల్ మార్గంసహా.. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలు వెల్లడించారు. వీటిలో విశాఖపట్టణంలోని ఏఐ హబ్ సైతం కలసి ఉంది. ఇక టాటా గ్రూప్ ఏఐ రెడీ డేటా సెంటర్ల ఏర్పాటుకు ఓపెన్‌ఏఐతో భాగస్వామ్యాన్ని ప్రకటించడం గమనార్హం! ఈ సదస్సులో దేశ సావరిన్ కంప్యూట్ సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు కీలక ప్రకటన వెలువడింది. ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన 38,000 జీపీయూలకు జతగా కొద్ది వారాలలో మరో 20,000 జీపీయూలకు తెరతీయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. దీంతో నేషనల్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరింత పటిష్టంకానుంది. 850 ఎగ్జిబిటర్లతో 10 థిమాటిక్ పెవిలియన్లతో ఏర్పాటైన ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఏఐ ఎగ్జిబిషన్‌లలో ఒకటిగా నిలిచినట్లు ప్రస్తావించింది.

# పోషక లోపాలు తీర్చే చొప్ప!

### పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులతో పశుపోషణలో సత్ఫలితాలు

దేశంలో పశువుల పోషకాహార లోటును పరిష్కరించడానికి పశు గ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ఒక సమర్థవంతమైన, సుస్థిరమైన పరిష్కారం. పంటలు పెరిగే దశలోనే వాటిలో అవసరమైన పోషకాల (జింక్, ఇనుము, రాగి వంటి సూక్ష్మపోషకాల) పరిమాణాన్ని, వాటి జీవ లభ్యతను సస్యవిజ్ఞాన పద్ధతుల్లో పెంపొందించుటుడాన్నే బయోఫోర్టిఫికేషన్ అంటారు.

## బయోఫోర్టిఫికేషన్ మూడు విధాలు:

1. నేల ద్వారా ఎరువుల వినియోగం.. పొలం మట్టిలో లోపించిన పోషకాలను లేదా సూక్ష్మపోషకాలను నీటిలో కలిపి నేలకు అందిస్తారు.

2. పంటులపై పిచికారీ చేయడం.. ఎరువులను ద్రవరూపంలో నేరుగా మొక్కల ఆకులపై పిచికారీ చేస్తారు. దీని వల్ల మొక్కలు పోషకాలను వేగంగా గ్రహిస్తాయి.

3. సూక్ష్మజీవుల ప్రయోగం.. నేలలో ప్రయోజనకరమైన సూక్ష్మజీవులను మట్టిలో కలుపుతారు. తద్వారా మొక్కలు నేల నుంచి పోషకాలను తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

## నత్రజని ప్రాముఖ్యత

పంట అభివృద్ధికి, పశుగ్రాస ఉత్పత్తికి నత్రజని చాలా కీలకమైన పోషకం. ఇది ప్రొటీన్లు, అమైనో ఆమ్లాలు, పత్రహరితం, ఇతర ముఖ్యమైన అణువుల నిర్మాణానికి అవసరం. నత్రజని ఎరువులు మేత నాణ్యతను, ముఖ్యంగా పొడి పదార్థం, ముడి మాంసకృత్తుల సాంద్రతను పెంచుతాయి. పరిశోధనా ఫలితాల ప్రకారం, హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు వాడినప్పుడు, మొక్కజొన్న గ్రాసంలో జింక్ (15.3%), రాగి (7.5%), మాంగనీస్ (28.4%), ఇనుము (15.6%) వంటి సూక్ష్మపోషకాల స్థాయిలు పెరిగాయి. నత్రజని (120 కిలోలు/హెక్టారు)ని పశువుల ఎరువుతో కలిపి వాడటం వల్ల పశు గ్రాసంలో ముడి ప్రొటీన్లు 36.56% వరకు పెరిగినట్లు పరిశోధనా ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

## గొర్రెల్లో జింక్ లోపం పోయింది

మొక్కజొన్న, అలసంద వంటి పశుగ్రాస పంటల పెరుగుదలకు, అధిక దిగుబడికి జింక్ చాలా ముఖ్యం. పశుగ్రాసంలో జింక్ లోపం ఉంటే పశువుల ఎదుగుదల తగ్గటం, పునరుత్పత్తి సమస్యలు, ఎముకలు, చర్మ కణజాలం దెబ్బతినటం జరుగుతాయి. 2020లో డా. గిరిధర్ బృందం బెంగళూరులో (ఐసీఏఆర్--ఎన్ఐఎన్‌పీ) ఒక అధ్యయనం చేసింది. జింక్ ఎరువులను నేలలో వేసి పండించిన జొన్న చొప్పను జింక్ లోపం ఉన్న గొర్రెలకు 120 రోజులపాటు ప్రయోగాత్మకంగా తినిపించారు. హెక్టారుకు 25 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తే జొన్న చొప్ప దిగుబడి హెక్టారుకు 4.2 టన్నులు పెరిగింది. చొప్పలో జింక్ పరిమాణం 14.4 పీపీఎం మేర వృద్ధి చెందింది. బయోఫోర్టిఫైడ్ చొప్ప తిన్న గొర్రెల్లో జింక్ స్థాయి పెరగటంతో పాటు.. రక్తంలోని జింక్ పరిమాణం పెరిగింది. వ్యాధి నిరోధక శక్తి పెరిగింది.



## రాగితో పెరిగిన దిగుబడి

పరిశోధనల ప్రకారం, ఓట్స్ పశుగ్రాస పంటకు నేల ద్వారా హెక్టారుకు 6 కిలోల రాగి అందించడం వల్ల దాని జీవలభ్యత పెరిగి దిగుబడి మెరుగుపడింది. అలాగే, విత్తిన 60--90 రోజుల్లో ఆకులపై 0.2% రాగిని పిచికారీ చేయటం వల్ల రాగి గ్రహణ శక్తి, దిగుబడి, ప్రొటీన్స్ గణనీయంగా పెరిగాయి. డా. సి.హెచ్. రామకృష్ణ బృందం హైదరాబాద్‌లో చేసిన పరిశోధన ఫలితాల ప్రకారం.. నేలకు హెక్టారుకు 25 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్‌ను సిఫారసు చేసిన ఎరువులతోపాటు దుక్కిలో వేస్తే.. పచ్చిమేతలో అత్యధిక జింక్ సాంద్రత (41.4 పీపీఎం) నమోదైంది. అలాగే, విత్తిన 15, 30, 45, 60 రోజుల తర్వాత 1% అన్నభేదిని ఆకులపై పిచికారీ చేస్తే అత్యధిక ఇనుము సాంద్రత (155.3 పీపీఎం) నమోదైంది. అంతేకాకుండా, ఈ పద్ధతులు సైలేజ్ (పాతరగడ్డి)లోని పోషక విలువలను కూడా మెరుగుపరిచాయి. అందువల్ల, ఇటువంటి బయోఫోర్టిఫైడ్ పశుగ్రాసం లేదా సైలేజ్‌ను ఎక్కువ కాలం మేతగా ఇవ్వడం వల్ల గొర్రెలలో శరీర బరువు, సగటు రోజువారీ పెరుగుదల, రక్తంలోని ఖనిజాల స్థాయిలను మెరుగుపరచవచ్చని నిరూపితమైంది. ఈ విధానం వల్ల నేల సారం పెరిగి పశుగ్రాస దిగుబడి పెరగడమే కాకుండా, ఇటు పశువుల్లో అటు మనుషుల్లోనూ ఉన్న ఖనిజ లవణాల లోపాలను సరిదిద్దవచ్చని ఈ అధ్యయనం వెల్లడించింది.

## జీవన ఎరువుల ప్రాముఖ్యత

రసాయన ఎరువులు మితిమీరి వాడకం వల్ల భూమి నిస్సారమవడమే కాకుండా, పశు గ్రాసంలో పోషకాల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఈ సవాలును ఎదుర్కోవడంలో మొక్కల పెరుగుదల ప్రోత్సహించే అజోటోబాక్టర్, అజోస్పిరిలియం వంటి జాతుల జీవన ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయి. జీవసంబంధమైన నత్రజని స్థిరీకరణ, ఫాస్ఫేట్ కరిగింపు, ఫైటో హార్మోన్ల ఉత్పత్తి వంటి చర్యల ద్వారా పోషకాల లభ్యతను పెంచుతాయి. ఇవి జీవసంబంధంగా నత్రజనిని స్థిరీకరించడం ద్వారా పంటల నాణ్యతను, దిగుబడిని మెరుగుపరుస్తాయి. ఈ సుస్థిర పద్ధతులను అవలంబించడం వల్ల నేల సారాన్ని కాపాడుకుంటూనే పశుపోషణను లాభసాటిగా మార్చుకోవచ్చు.

## గణనీయమైన మార్పు..

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో కూడిన బయోఫోర్టిఫికేషన్ వ్యూహాల అమలు ద్వారా దేశ పశుపోషణ రంగంతోపాటు, ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చు. అయితే, పశు గ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ద్వారా మేత పోషక విలువను పెంచే పద్ధతి అమలుకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. నేలలోని పోషక అసమతుల్యతలు, ఉదాహరణకు అధిక ఫాస్ఫరస్ స్థాయిలు జింక్ శోషణను నిరోధించడం వంటివి మొక్కల పోషక గ్రహణ శక్తిని దెబ్బతీస్తున్నాయి. వేడిగాలులు, కరువులు, వర్షపాతంలో ఒడిదుడుకులు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు పంట పెరుగుదలను, పోషకాల గ్రహణను నిరోధిస్తాయి. ఆర్థిక, సామాజిక అంశాలు కూడా ఈ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయి. సూక్ష్మపోషక ఎరువులు, అధునాతన సాంకేతికతలతో కూడిన ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల చిన్న రైతులు ఇటువంటి నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించలేక పోతున్నారు. పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులపై మరింత పరిశోధన జరగాలి. ఖర్చు--ప్రభావంపై దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరం.

# చాట్‌జీపీటీని బాయ్‌కాట్ చేసిన 25 లక్షల మంది!




అమెరికా రక్షణ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సేవలపై వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయి. చాట్‌జీపీటీని బహిష్కరించాలంటూ ప్రతిజ్ఞకు పిలుపునిచ్చిన ఒక వెబ్‌సైట్.. ఇప్పటికే సుమారు 25 లక్షల మంది వినియోగదారులు చాట్‌జీపీటీని బాయ్‌కాట్ చేసినట్లు పేర్కొంది. 900 మిలియన్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ఓపెన్‌ఏఐ గత వారం అమెరికా రక్షణ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. రక్షణ శాఖ తన వర్గీకృత నెట్‌వర్క్‌లో ఏఐ మోడల్‌ను అమలు చేయడానికి అనుమతి లభించింది. ఈ డీల్‌తో వినియోగదారుల అసంతృప్తి పెరుగుతోందని ఆ వెబ్‌సైట్ వెల్లడించింది. సంతకాల సంఖ్య, సోషల్ మీడియా షేర్లు, యాప్ వినియోగ డేటా ఆధారంగా ప్రజలు చాట్‌జీపీటీపై విశ్వాసం కోల్పోతున్నారని పేర్కొంది. "అమెరికన్లతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్లను చాట్‌జీపీటీ నుంచి నిష్క్రమించడానికి మేము సమన్వయం చేస్తున్నాం. వినియోగదారుల చర్యల ద్వారా ఓపెన్‌ఏఐకు స్పష్టమైన సందేశం పంపవచ్చు" అని వెబ్‌సైట్ పేర్కొంది. ఇదిలా ఉండగా, సెన్సార్ టవర్ విశ్లేషణ ప్రకారం.. పెంటగాన్ నుంచి తప్పుకొన్న ఆంత్రోపిక్ రూపొందించిన 'క్లాడ్' చాట్‌బాట్ యాప్, అమెరికాలో యాపిల్ యాప్ స్టోర్ చార్టుల్లో చాట్‌జీపీటీ యాప్‌ను అధిగమించి అగ్రస్థానానికి చేరినట్లు సమాచారం. అలాగే టెక్‌క్రంచ్ నివేదిక ప్రకారం.. గత శనివారం చాట్‌జీపీటీ మొబైల్ యాప్ యూఎస్‌లో అన్‌ఇన్‌స్టాల్‌ల సంఖ్య రోజుకు 295 శాతం పెరిగినట్లు వెల్లడైంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .